నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

ఆదివారం అనుబంధం

28.9.2025

శతవసంతాల

# ఆర్ఎస్ఎస్



## చైర్మన్‌తో ముఖాముఖి

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఏడు విమానాశ్రయాలకు ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపిందని వార్తలు వస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు మీ కు తెలిస్తాయి కదా? మీరేమంటారు?**

**= రాజశేఖర్ రెడ్డి కె. విజయవాడ**

అవును రాజశేఖర్ గారూ... మీరు విన్నది నిజమే... ఏపీలో జిల్లాలలో ఎయిర్ పోర్టు ల ఏర్పాటు కు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు కొత్త ఎయి ర్పోర్టకు సంబం ధించిన కసరత్తు కూడా జరుగుతోంది. తాజాగా ప్రకాశం జిల్లా ఒంగోలు విమానాశ్రయం నిర్మాణం కోసం ప్రతిపాదించిన భూముల వివరాలను సర్వే నెంబర్ల వారీగా పంపాలని రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) జిల్లా అధికారులను కోరింది. కొత్తపట్నం మండలంలో విమానాశ్రయం కోసం మొదటి దశలో 798ఎకరాలు, రెండో దశలో 300 ఎకరాలు, మొత్తం 1,098 ఎకరాలు సేకరించాలని ప్రతిపాదించారు. ఈ భూముల్లో వాన్పిక్తో పాటు ప్రభుత్వ భూములు, రైతుల నుంచి సేకరించాల్సిన భూములు కూడా ఉన్నాయి. ..ఇటీవల ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జిల్లా అధికారులతో కలిసి విమానాశ్రయం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు విమానాశ్రయం ఏర్పాటుపై అధ్యయనం చేయడానికి ఒక ప్రైవేటు సంస్థకు టెండర్లు పిలిచారు. ఈ క్రమంలో ప్రతిపాదిత భూముల వివరాలను సర్వే నెంబర్ల వారీగా పంపాలని ఏపీఏడీసీఎల్ కోరింది. ఇప్పటికే భూములకు సంబంధించిన జాబితా సిద్ధం చేశామిని.. త్వరలోనే ఆ జాబితాను ఏపీఏడీసీఎల్కు పంపనున్నట్లు సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. ఒంగోలు విమానాశ్రయం నిర్మాణం కోసం ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఒంగోలు విమానాశ్రయం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీ నుండి వచ్చిన ప్రత్యేక బృందం కొత్తపట్నంలోని భూములను పరిశీలించింది. విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలంగా ఉందని తెలిపింది. ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని ఏపీఏడీసీఎల్ ప్రకటన చేసింది. మొదటి విడత భూసేకరణకు రూ.102 కోట్ల పరిహారం అవసరమని అధికారులు అంచనా వేశారు. ప్రకాశం జిల్లాకు వాణిజ్యపరంగా మంచి పేరు ఉంది. ఇక్కడ గ్రానైట్, పొగాకు వంటి వ్యాపారాలు జరుగుతున్నాయి. చాలామంది ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారు. రామయ్యపట్నం పోర్టు దగ్గరలో ఉండటం, సముద్ర తీరం కూడా అందుబాటులో ఉండటంతో ఒంగోలులో ఎయిర్పోర్టు కట్టాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఎయిర్పోర్టు ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను చాలాసార్లు కలిశారు. సముద్ర తీరం దగ్గరగా ఉండటంతో ఒంగోలులో ఎయిర్పోర్టు కట్టడానికి అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.

**ఆసియా కప్ 2025లో పాకిస్తాన్తో జరిగిన మ్యాచ్లో యూఏఈ బౌలర్ జునైద్ సిద్ధిఖీ సంచలనం సృష్టించాడు. పాకిస్తాన్లోనే పుట్టి యూఏఈకి ప్రాతినిధ్యం వహిస్తున్న జునైద్ సిద్ధిఖీ, కీలకమైన నాలుగు వికెట్లు తీసి పాక్ బ్యాటింగ్ లైనప్ను కుప్పకూల్చాడు. అతని ధాటికి పాక్ జట్టు 150 పరుగుల లోపే పరిమితమైంది. అయితే, యూఏఈ బ్యాటింగ్ వైఫల్యంతో పాక్ విజకుందయం సాధించింది. ఈ విజయంతో పాక్ సూపర్ 4కు చేరుకుందన్నది నిస్సందేహం. మీరేమంటారు.?**

**–ద్రేవు ఉమామహేశ్వరరావు, మణికొండ, హైదరాబాద్**

**మీరన్నది నిజమే ఉమామహేశ్వరరావుగారూ...** ఆసియా కప్ 2025లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) బౌలర్ జునైద్ సిద్ధిఖీ పాకిస్తాన్ను గడగడలాడించాడు. ఓపెనర్లతో పాటు కీలకమైన మిడిలార్డర్ బ్యాటర్లనూ పెవిలియన్కు పంపి ప్రత్యర్థిని భారీ స్కోర్ చేయకుండా నిలువరించాడు. అయితే ఇందులో ట్విస్ట్ ఏంటంటే జునైద్ సిద్ధిఖీ యూఏఈ తరఫున ఆడుతున్నా.. పుట్టింది మాత్రం పాకిస్తాన్లోని ముల్తాన్లో. దాంతో సొంత దేశంపైనే సత్తా చాటి తన పేరు పాక్కు వినిపించేలా చేశాడు. మూడు మ్యాచ్లలో 9 వికెట్లు తీసి ఈ ఆసియా కప్లోనే అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్గా నిలిచాడు. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా బుధవారం రాత్రి పాకిస్తాన్, యూఏఈ మధ్య ఆసక్తికర పోరు సాగింది. తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్లో పాక్ ఎట్టకేలకు విజయం సాధించింది. అయితే ఒకానొక దశలో యూఏఈ పోరాడుతున్నట్టు కనిపించినా పాక్ బౌలింగ్ ముందు చతికిలపడిపోయింది.టాస్ గెలిచిన యూఏఈ కెప్టెన్ ముహమ్మద్ వసీమ్ పాకిస్తాన్ను బ్యాటింగ్కి ఆహ్వానించాడు. యూఏఈ పేస్ బౌలర్ జునైద్ సిద్ధిఖీ ఆరంభంలోనే పాక్ బ్యాటర్లకు షాక్ ఇచ్చాడు. మొదటి ఓవర్ ఐదో బంతికి సయీమ్ అయూబ్ను అవుట్ చేసిన జునైద్, తన రెండో ఓవర్లో షాహిబ్జాదా ఫర్హాన్ను పెవిలియన్కు పంపాడు. దాంతో పాక్ 9 పరుగులకే ఓపెనర్లు ఇద్దర్నీ కోల్పోయింది.డెత్ ఓవర్లలో పాకిస్తాన్ భారీ స్కోర్ చేస్తుందని అందరూ అనుకున్నప్పటికీ.. 17, 19వ ఓవర్లలో హిట్టర్లన్నీ అవుట్ చేసి జునైద్ తన సత్తా ఏంటో చాటాడు. మహమ్మద్ నవాజ్, మహమ్మద్ హారిస్ను వరుస ఓవర్లలో అవుట్ చేసి పాక్ను 150 పరుగుల లోపే నిలువరించాడు. నాలుగు ఓవర్లు వేసిన జునైద్ సిద్ధిఖీ కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు.పాకిస్తాన్ అందించిన లక్ష్యాన్ని ఛేదించడంలో యూఏఈ ఓపెనర్లు కొంత సహకరించినా.. టెయిలెండర్స్ సింగిల్ డిజిట్స్కే అవుటవ్వడంతో ఓటమి తప్పలేదు. యూఏఈలో రాహుల్ చోప్రా 35, ధృవ్ 20 పరుగులతో రాణించగా, ఏకంగా ఏడుగురు ఆటగాళ్లు సింగిల్ డిజిట్స్కే పరిమితమయ్యారు. దాంతో 17.4 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ విజయంతో పాక్ సూపర్ 4లో అడుగుపెట్టగా, యూఏఈ ఇంటిదారి పట్టింది.



**నూకారపు సూర్య ప్రకాశరావు**
**చైర్మన్, సూర్య తెలుగుదినపత్రిక**

## లెజెండ్

### లలితసంగీత మహామహోపాధ్యాయ"

# మహాభాష్యం చిత్తరంజన్



**శ్రీనివాస్ జొన్నల గడ్డం**

**(గత వారం తరువాయి)**

'కోసల' రాగంలో వారు కూర్చిన "విరబూసి ఇరుల తరులు" పాటని 9 సం.ల శ్రీకర్ 'పాడుతా తీయగా' ప్రీఫైనల్స్‌లో పాడినప్పుడు ఎస్.పీ. బాలసుబ్రహ్మణ్యం గారి కళ్ళు చెమర్చి, వాడిని అక్కున చేర్చుకుని, ముద్దు పెట్టుకుని, ఉత్తమప్రతిభాపురస్కారాన్ని ఇచ్చిన సంఘటన మరచిపోలేనిది.పాటని నేర్పేటప్పుడు దాని సాహిత్యంలోని భావుకతని ఎక్కడికక్కడ ప్రస్తావిస్తూ, దానికి అనువైన రాగాన్ని ఎంచుకున్న విధానాన్ని సూచిస్తూ, బాణీలో స్వరాక్షరాలు, అన్యస్వరప్రయోగాల చమత్కారాన్ని ఎత్తి చూపుతూ– ఇలా ఎన్నో విశేషాల వివరణతో కూడిన పద్ధతి మాస్టర్ గారిది. అంతేకాదు, వాటిలోని వివరాల పట్ల ఒక ఖచ్చితత్వం ఉంటుంది. ఔత్సాహిక శిష్యులకి అది ఒక మందాకినీప్రవంతి. మరొక ముఖ్యమైన అంశం ఏమిటంటే వారు శిష్యుల నుండీ ప్రశ్నలని ఆశిస్తారు. తగినంత ఆలోచనని చేసి, లోతుగా నేర్చుకోవాలని ఆశిస్తారు. ఉత్తమశ్రేణికి చెందిన గురువుల లక్షణం అది!

అలాగే, శాస్త్రీయసంగీతాన్ని కూడా ఎలా అర్థం చేసుకోవాలో చెపుతుంటారు. "నీ దయ రాదా" కీర్తనయొక్క పల్లవిలో ఉన్న ఒక్కొక్క సంగతీ ఎందుకు అలా ఉన్నది అని వారు చేసిన విశ్లేషణ నాకు ఎన్నో కొత్త కోణాలను చూపించింది. సమకాలీన శాస్త్రీయ గాయకులు వాటిని పాడుతున్న పద్ధతిని నిరసిస్తూ, వారు ఒక మాటని అన్నారు: "విద్వాంసుడు వేరు– కళాకారుడు వేరు." ఆ ఒక్క వాక్యం నాకు ఎన్నాళ్ళుగానో ఉండిపోయిన కొన్ని ప్రశ్నలకి సమాధానాలని ఇచ్చింది. శాస్త్రీయ, లలితశాస్త్రీయ, లలిత, జానపద, పాశ్చాత్య సంగీతపద్ధతులని అన్నిటినీ ఆకళింపు చేసుకున్న మాస్టర్ గారు వాటి తులనాత్మక పరిశీలనని చేయగల అతి కొద్దిమందిలో ఒకరు అని నిస్సందేహంగా చెప్పవచ్చు.వైలక్షణ్యం ఒక అత్యున్నతస్థాయి గాయకులుగా, సంగీతకారులుగా, వాగ్గేయకారులుగా మాత్రమే చూస్తే మాస్టర్ గారిలోని విలక్షణతని పూర్తిగా పట్టుకోలేము. అదనంగా చిత్తరంజన్ గారి ప్రత్యేకత ఏమిటి అనే ప్రశ్నని వేసుకుంటే, నాకు కనిపించే ముఖ్యమైన లక్షణాలు మూడు: (1) అలుపెఱుగని జ్ఞానపిపాస, (2) అకుంఠితకార్యదీక్ష, (3) తనకు తెలిసిన సర్వస్వాన్నీ శిష్యులకి నేర్పాలనే తపన. విడివిడిగా ఈ మూడు లక్షణాలనీ వ్యక్తులలో మనం గమనిస్తూ వుంటాము. కానీ, ఒకే వ్యక్తిలో ఈ మూడింటి కలయిక చాలా అరుదు. చిత్తరంజన్ గారు అటువంటి అరుదైన వ్యక్తి. మాస్టర్ గారికీ, నాకూ సాలూరు రాజేశ్వరరావు గారి పాటలు చాలా ఇష్టం. "పాట పాడుమా కృష్ణా", "ఎందుకే నీకింత తొందర" (మల్లీశ్వరి), "ఆ తోటలో నొకటి ఆరాధనాలయము", మొ. పాటలలోని ప్రయోగాలగురించి మేము గంటల కొద్దీ చర్చించుకున్నాము. ఆ చర్చలలో అనేక గూఢమైన విషయాలు వెలికి వస్తుండేవి. ఒక్క స్వరం పాటని ఎంతగా ప్రభావితం చేయగలదో. ఒక్క స్వరప్రస్తారం పాటకి తనదైన ముద్రని ఎలా ఇవ్వగలదో వివరించేవారు.

ఇటీవలి ఒక సంఘటనని ప్రస్తావిస్తాను. మలయాళ సంగీతదర్శకులు దేవరాజన్ గారి పాటలని వింటుంటే 1975 సినిమా "స్వామి అయ్యప్ప" (డబ్బింగ్) లోని 'జగముల నేతా భాగ్యవిధాతా శ్రీమన్నారాయణా' పాట తటస్థపడింది. కర్నాటక భైరవి రాగం ఆధారంగా చేసిన సినిమా పాటలు చాలా తక్కువ. ఆ పాట భైరవిలా వినిపించింది. వెంటనే మాస్టర్ గారికి పాట %శీబుబఎవ% లింక్ ని మెసేజ్ చేశాను. అప్పుడు సమయం రాత్రి 10:15. కొద్ది నిమిషాలలోనే మాస్టర్ గారు ఫోన్ చేశారు. ఆ పాట భైరవిలోనే ఉందని ధ్రువపరిచారు. పాటయొక్క కాంపోజిషన్ గురించీ, యేసుదాస్ గారి గానంగురించీ కాసేపు మాట్లాడుకున్నాము. దాదాపు 84 సంవత్సరాల వయసులో వారికి ఉన్న ఈ తృష్ణా, ఉత్సాహమూ నావంటి వారందరికీ గొప్ప స్ఫూర్తి!

### సువర్ణసౌరభం

"సంగీతజ్ఞానము భక్తి వినా సన్మార్గము గలదే", "నిధి చాల సుఖమా" అన్న త్యాగరాజ స్వామి తత్త్వసారం తొలినుండీ నిబిడీకృతమైన అమనస్కులు చిత్తరంజన్ గారు. అంతర్దృష్టితో సచ్చిదానందస్వరూపులైన శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారిని ఉపాసించి, అపారమైన ఆధ్యాత్మికజ్ఞానార్జన చేశారు. సంక్లిష్టమైన అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సిద్ధాంతాలను విశదీకరిస్తూ "శ్రీ సుబ్రహ్మణ్యతత్త్వం" సంపుటి ద్వారా ఎన్నో కీర్తనలని వెలువరిచిన వాగ్గేయకారులు! ఆత్మ, అహం భావనల తాత్త్వికమూలాలని శోధించి, అద్వైతస్థితిని చేరుకున్న వీరు, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి అనుజ్ఞతో "అవధూత శ్రీ షణ్ముఖ చిత్తరంజనస్వామి"గా ఇప్పటికి దాదాపు 140 మందికి జ్ఞానదీక్షని ఇచ్చారు. నిత్య సాహిత్య, సంగీత, ఆధ్యాత్మిక కృషీవలురైన డా. చిత్తరంజన్ గారితో ప్రత్యక్షపరిచయం నా భాగ్యం. వారికి నా పాదాభివందనాలు!!




## ముఖచిత్ర కథనం

మారుమూల ప్రాంతమైన మన్నెంజిల్లా పాలకొండలో వేంచేసిన శ్రీశ్రీశ్రీ కోటదుర్గమ్మ వారి దసరా ఉత్సవాల వివరాలను పాలకొండ సంస్థానం చరిత్రను. కోటలో అమ్మవారి పూజా వైభవాన్ని, జమిందారీ వ్యవస్థ పతనాన్ని కళ్లకు కట్టినట్టు వివరిస్తూ సాగిన వ్యాసం ముఖచిత్ర కథనంగా రావటం ఆనందంగా ఉంది. ప్రచురించినందుకు ధన్యవాదాలు, రచయితకు, ప్రచురణ కర్తలకు కృతజ్ఞతలు అనేక అంశాలను, మాకు తెలియని వాటిని విపులంగా, వివరంగా వివరిస్తూ ంయాజమాన్యానికి ధన్యవాదాలు. సందర్భానుసారంగా మీ కథనాలు బాగున్నాయి. ఇదే పంథా కొనసాగించండి.

**మండపాక శ్రీధర్, పాలకొండ**
**ముప్పాళ వెంటకట రమణ, శ్రీకాకుళ-కస్తూరి శివరావు, విజయవాడ**
**-చినవీరభద్రుడు కణపాక, హైదరాబాద్**

## సినిమా రివ్యూలు

వారం వారం విడుదలవుతున్న సినిమాలపై మీ విశ్లేషణ బాగుంది. ధన్యవాదాలు. ఓటిటి సినిమాలపై కూడా విశ్లేషణ చేయటం హర్షణీయం.

ఆదివారం అనుబంధం

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

28.9.2025

**- ఎలకల రవికుమార్,**
**విశాఖపట్నం**
**- లింగమనేని రాజేష్, అనపర్లి**
**-వాడపల్లి గణేష్ కుమార్ హైదరాబాద్**

## బుడత బాగున్నాడు

చిన్నారి ప్రపంచంలా ప్రచురిత మవుతున్న బుడత పేజీలో చిన్నారులకు వుపయుక్తంగా రచయితలు రాస్తున్న కథలు బాగున్నాయి. అలాగే పజిల్స్ విజ్ఞాన వంతంగా ఉన్నాయి. తెలుగువారి శతకాలు, పద్యాలు అప్పుడప్పుడు మిస్ అవుతున్నాం. తప్పక ప్రచురించండి

**-కోరుట్ల రమాదేవి, తెనాలి**
**-మక్కామల పద్మావతి, హైదరాబాద్**



## బతుకమ్మ పండుగ



అమ్మలంతా అక్కలంతా
చిట్టితల్లులు చిన్ని చెల్లెళ్లు
పడతులందరు ఒక్కచోట చేరి
చేసుకునే పండుగ బతుకమ్మ!
భామల నవ్వులన్నీ బంతిపూలుగా
తలుపులన్నీ తంగేడుపూలుగా
కన్నెల కలలన్నీ కట్లపూలుగా
పేర్చి తీర్చిదిద్దుతురు బతుకమ్మను!
రంగు రంగుల బట్టలతో
ధగ ధగల నూతన నగలతో
తీరు తీరు పూలు నెత్తిన పెట్టి
ప్రకృతి వేషం వేసెదరు అతివలందరు!
మనసు ముచ్చట్లు గుండె చప్పుళ్ళు
చప్పట్లతో పాటలు పాడుతూ
బతుకమ్మ ఉయ్యాలో అంటూ
సంతోషాన్ని పొందే పండుగ!
సద్దులని సమిలులని
చిన్నా పెద్దా తేడా లేకుండా
వరుసలతో వాయినాలు ఇచ్చుకుంటూ
అంతస్తులుకావు ఆత్మీయతలు మావని!
చాటి చెపుతూ పాట చెపుతూ
గౌరమ్మ మాయమ్మా అంటూ
పేట పేటన ప్రతి ఏట జరుపుకునే
బ్రతుకు పండుగ బతుకమ్మ పండుగ!!

**జగ్గయ్య.జి 9849525802**

## ఆశల పల్లకి



నక్షత్రంలా తళతళా నవ్వుతూ..
శశిలా చల్లని వెన్నెల కురిపిస్తూ..
చెట్టులా నీడను పంచుతూ..
పువ్వులా సుగంధాల్ని వెదజల్లుతూ..
తోటలా పండ్లను వితరణ చేస్తూ..
నీటిలా దాహం తీరుస్తూ..
అన్నంలా ఆకలిని తరుముతూ..
గాలిలా ప్రాణాలు నిలుపుతూ..
కలంలా భావాలు ఒలకబోస్తూ..
ఇంధనంలా ప్రగతి రథాన్ని నడుపుతూ..
అంతరిక్షంలా అద్భుతాల్ని దాస్తూ..
నేలలా పంటరాసుల్ని బహుకరిస్తూ..
సాగర అలలా పడినా లేస్తూ..
కొవ్వొత్తిలా కరిగినా వెలుగులు పంచుతూ..
వయసు తరిగినా జ్ఞానార్జన కొనసాగిస్తూ..
కాలం కరిగినా ఆఖరి తీరం దాటుతూ..
ఆశల పల్లకిలో ఆసాంతం ఊరేగుతూ..
నిన్నటి కన్న నేడు మెరుగ్గా ఉంటూ..
సాగిపోవడమే సాహసోపేత జీవన యాత్ర !

**మధుపాళీ , 949700037**

# "అమెరికాలో బుగ్గ రామస్వామి గుర్తొచ్చింది "!



సాధారణంగా మనిషి ముఖంకు ఇర-ంవైపుల ఉన్న చెక్కిలి బుగ్గలను చూసి జన్మతః వచ్చినాయని సరి పెట్టుకుంటాము.అదే భూమి నుండి ఉబికి వచ్చిన "నీటి బుగ్గకు" మాత్రం ఆద్యాత్మికతతో పూజిస్తారు.బుగ్గ భౌతికతను కనీసం సమీక్షించుకోవడానికి కూడా శ్రద్ధ చూపం .గురుత్వాకర్షణ మరియు జల స్థితిక పీడనం వంటి వివిధ సహజ శక్తుల ద్వారా నీటి బుగ్గలు ఉపరితలంపైకి నెట్ట బడతాయి. జలాశయాల్లోకి ఎక్కువ నీరు ప్రవేశించినప్పుడు అక్కడ ఉన్న నీటిపై ఒత్తిడి పెరిగి సహజ సిద్ధంగా ఉపరితలంపైకి వస్తాయి. కొండ వాలులలో,లోయలలో భూగర్భ జలాలు ఉపరితలానికి వస్తాయి.వర్షం నీరు ,కరిగే మంచు రీఛార్జ్ గా భూమిలోకి చొచ్చుకపోయి పారగమ్య శిల లేదా జలాశయాలుగా పిలువబడుతున్న నేల యొక్క భూగర్భ పొరలను నింపుతాయి. భూగర్భంలో ఉండే గుహలలో కార్బన్ కార్బన్ డై ఆక్సైడ్ విడుదలై అక్కడి నీటిలో కరిగిపోయి వాయువుతో కూడిన కార్బానిక్ ద్రవం ఉత్పన్నమై భూపరితలానికి తన్నుక వచ్చిన నీటినే "బుగ్గ/స్ప్రింగ్ గా పరిగణిస్తున్నారు.అయితే నీటి బుగ్గలపై బావవాద దృక్పథమైన విశ్వాసాలు ఉండటం గమన్హారం . ఇప్పటి పెద్దపల్లి జిల్లా"బసంతనగర్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రక్కనున్న గుట్ట కింద "బుగ్గ రామస్వామి" ఉంటాడు.అక్కడి గుట్ట దిగువ నుండి భూగర్భ జలం ఉబికి "చెలిమ"గా నీళ్లు పారుతాయి.అట్టి బుగ్గ నీళ్లను ఆధ్యాత్మికతతో "బుగ్గ రామస్వామి" టెంపుల్ నిర్మాణం చేశారు.పరిసర గ్రామాలు, రామగుండం ప్రజలు,గోదావరిఖని సింగరేణి కార్మికులు సందర్శించి వన భోజనాలను ఆరగించుతారు.అట్లాగే మంచిర్యాల జిల్లా "కన్నాల గ్రామంలో అన్ని కాలాల్లో మోచేతి నీళ్లు ఊరే మూడు ఊటలున్న దగ్గర ""శ్రీ రాజరాజేశ్వర ఆలయం, కర్నూలు జిల్లా, ఓర్వ కల్లు మండలం,కాల్వ బుగ్గ గ్రామంలో వెలసిన "బుగ్గ రామేశ్వర స్వామి ఆలయం "ఉంది.మాతృ హనన పాతక నివృత్తి కోసం పరశురాముడు ఈ ప్రాంతానికి వచ్చి "శివ లింగాలను ప్రతిష్టించినారని నమ్ముతారు.ఇక్కడ అన్ని కాలాల్లో స్వచ్ఛమైన నీరు రామేశ్వరుని శిరస్సు నుండి,శివలింగం నుండి బుగ్గ నీరు వస్తూనే ఉంటుంది.వికారాబాద్ జిల్లాకు నాలుగు కిలో మీటర్ల దూరంలోని అనంతగిరి కొండల్లో "బుగ్గ రామలింగేశ్వర ఆలయం ఉంది.రావణ సంహారం తరువాత బ్రాహ్మణ హత్య దోష నివారణ కోసం శ్రీరామచంద్రుడు ఇక్కడ శివ లింగాలను ప్రతిష్టించి వాటి అభిషేకం గురించి భూమి మీద బాణాన్ని సంధించగా భూమి నుండి నీరు బుగ్గ రూపకంగా ఉబికి వచ్చిందని నమ్ముతారు.ఇలా తెలుగు నేల మీద సహజ సిద్ధంగా ఉపరితలంపైకి వచ్చిన నీటి చెలిమలకి,బుగ్గలకు ఆధ్యాత్మికత నమ్మకాలు ఉన్నాయి.

అమెరికాలో పెద్ద నీటి బుగ్గలు దాదాపు 10 ఉన్నవి.ఫ్లోరిడాలో "సిల్వర్ స్ప్రింగ్ "ప్రతి రోజు 572 మిలియన్ గ్యాలన్ ల స్వచ్ఛమైన నీరు పైకి ఉబికి వచ్చి సిల్వర్ నది ప్రవాహానికి జీవదార అవుతుంది.ఇంకా రెయిన్బో స్ప్రింగ్ రోజుకు 490 మిలియన్ గ్యాలన్ ల నీటిని,బిగ్ స్ప్రింగ్ రోజుకు 286 మిలియన్ గ్యాలన్ ల నీరుని,వకుల్లా స్ప్రింగ్ రోజుకు 200 మిలియన్ గ్యాలన్ ల నీరుని, వోలూసియా బ్లూ స్ప్రింగ్ రోజుకు 104 మిలియన్ గ్యాలన్ ల నీరుని ఇస్తుంది. ఏ నీటి బుగ్గను ఆధ్యాత్మికంగా ఆరాధించడం అరుదుగా కూడా కనిపించదు. అమెరికాలో 19వ,పట్టణంగా పేరొందిన మిస్సోరి స్టేట్ లోని "సెయింట్ లూయిస్" కు నైరుతి దిశలో దాదాపు 90 మైళ్ల దూరంలో "ఫెల్ప్స్ కౌంటీలో జేమ్స్ మారమెక్ స్ప్రింగ్ ఉంది.దీనికి 5వ,అతి పెద్ద నీటి బుగ్గగా పేరుంది.ఈ నీటి బుగ్గ నుండి రోజుకు సగటుగా 99 మిలియన్ గ్యాలన్ ల నీరు పైకి వస్తుంది.నిరంతరం వాగును/చిన్న నదిని తలపించే విధంగా ప్రవహించి మిస్సిస్సిపి నదికి ఉపనది అయిన మారామెక్ నదిలో కలుస్తుంది.మిస్సోరి ఆగస్ట్ 1821 లో రాష్ట్ర హోదాను పొందింది.1823 లో అమెరికా జనరల్ ల్యాండ్ సర్వేయింగ్ జరిపిన నథానియల్ కుక్ ఇక్కడ "హెమటైట్" ఉన్నదని గుర్తించాడు.అప్పుడు ఒహియోలో ఐరన్ వర్క్ నిర్వహిస్తున్న "థామస్ జేమ్స్" భూనివేదిక గురించి తెలుసుకుని 1825 లో స్వయంగా భూభాగాన్ని పరిశీలించాడు.ఇక్కడ ఇంధనం కోసం దట్టమైన అడవుల కలప,ఇనుము ఉత్పత్తిని పెంచడానికి సున్నపురాయి ఖనిజ నిక్షేపాలు(ఫ్లక్స్),హెమటైట్ (ముడి ఖనిజం)మరియు నిరంతరంగా ఉబికి వస్తున్న నీటి బుగ్గ (నీరు) ఉన్నందున 1826లో "మారామెక్ ఐరన్ వర్క్స్" నిర్మాణం మొదలు పెట్టి 1829 లో పర్నేస్ ను పూర్తి చేశాడు.500 మందితో రోజుకు 12 గంటలు వారంలో ఏడు రోజులు మారమెక్స్ ఐరన్ వర్క్స్ పని చేసి "ఐదు దశాబ్దాలు" ప్రధాన సరఫరాదారుగా ఎదిగింది. మారమెక్స్ ఐరన్ వర్క్స్ మరియు 10 వేల ఎకరాల భూమిని 1844లో థామస్ జేమ్స్ తన కుమారుడైన విలియమ్ జేమ్స్ కు బాధ్యతలను అప్పగించాడు.1856లో థామస్ జేమ్స్ మరణించాడు.1860 నాటికి ఐరన్ వర్క్స్ ఉచ్ఛస్థితికి చేరుకుంది.అమెరికా అంతర్యుద్ధంలో యూనియన్ కు ముడి ఇనుమును అందించడంలో కీలక పాత్రను పోషించింది.కాని ప్రధానంగా అభివృద్ధి చెందిన సాంకేతికత పరిజ్ఞానం వలన ఉత్పన్నమైన పోటీ వలన "మారామెక్ ఐరన్ వర్క్స్"దివాళా తీసింది.1920లో థామస్ జేమ్స్ ముని మనుమరాలు "లూసివర్ధం జేమ్స్"చుట్టు పక్కల ఉన్న అడవి,వ్యవసాయ భూములతో సహా "మారామెక్ స్ప్రింగ్ (బుగ్గ)"యాజమాన్యాన్ని చేపట్టింది.1938 జనవరి 4న,మరణించిన అనంతరం రెసిడ్యూరీ ఎస్టేట్ ను ట్రస్టీలో భాగంగా చేసి "జేమ్స్ ఫౌండేషన్ " ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది.ప్రకృతి సౌందర్యాన్ని, ఐరన్ వర్క్స్ చరిత్రను నేడు "మారామెక్ స్ప్రింగ్ పార్క్" గా సందర్శకుల మానసిక ఉన్నతికి ఆశ్రయం ఇస్తుంది.అలాగే మారామెక్ స్ప్రింగ్/ బుగ్గ నుండి వచ్చే నీటి ప్రవాహాన్ని రెండు పాయలుగా పారించిన నీటిలో చేపల పెంపకం చేస్తూ ఉపాధిని,ఆహ్లాదాన్ని, పౌష్టికాహారాన్ని అందిస్తు న్నారు.వీకెండ్ శని,ఆదివారాల్లో వందల మంది కుటుంబాలతో సందర్శించుతారు."తెలుగు అమెరికన్స్" కూడా వన భోజనాలకు పోతారు.లాభాపేక్ష లేని జేమ్స్ ఫౌండేషన్ కారుకు ప్రవేశ రుసుంగా %వి% 5 డాలర్లు (రూ.441.36) షెల్టర్ కు %వి% 50 డాలర్లను తీసుకుంటారు.అమెరికాలో దేవుడిపై విశ్వాసం ఉన్నప్ప టికీ కూడా పర్యావరణాన్ని,జీవావరణాన్ని, సహజ సంపదలను కూడా బౌతికతతోనే ఆరాధించడం కనిపిస్తుంది.కాని భారత్‌లో ప్రకృతి సంపదలను దైవాతీత శక్తులుగా ఆరాధిస్తూ మొక్కులు ర్పించుకుంటారు.సాధారణంగా కొత్తదనం చూసినప్పుడు పాత జ్ఞాపకాలు మదిలోకి రావడం సహజం .అందుకే అమెరికాలో కూడా మన బుగ్గ రామస్వామి గుర్తొచ్చిండు.



**మేరుగు రాజయ్య - 9441440791.**

సూర్య
www.suryaa.com
28.9.2025
ఆదివారం అనుబంధం

# బుడత



## బాలల కథ

## ఎవరు గొప్ప




దేవదేవుడు ఆజ్ఞ మేరకు బ్రహ్మ సృష్టి చేసేవాడు. బ్రహ్మ సృష్టికి పంచభూతాలు ఆకాశం, వాయువు, నిప్పు, నీరు, భూమి సాయం చేసేవి. ఆలా ఈ ప్రపంచం సాఫీగా నడిచేది. ఇలా కొన్ని వేల సంవత్సరాలు గడిచాక పంచభూతాల మనుసులు మారాయి. గర్వం పెరిగింది. అసూయ, ద్వేషం వాటి మనసుల్లోకి ప్రవేశించాయి. పరస్పరం ఒకదానిమీద ఒకటి కత్తులు దూసుకున్నాయి. నేను గొప్పంటే నేనే గొప్ప అనుకున్నాయి. ఈ భూమాండలానికి పైకప్పులా నేనే కాపాడుతున్నానని ఆకాశం అన్నది. జీవులకు ప్రాణావాయువునిచ్చి బ్రతికిస్తున్నది తానేనని గాలి చెప్పింది. జీవుల ఆహారం జీర్ణమయ్యేలా చేసేది తానేనని నిప్పు గారాలు పోయింది. జీవుల ఆహారానికి అవసరమయ్యే పంటలు పండటానికి కారణం నేనే నని నీరు పేర్కొంది. అసలు ప్రాణులు నిలబడిందే నా మీద అన్నది భూమి. ఇలా పంచభూతాలు ఎవరికి వారే గొప్పని పని చేయటం మానేశాయి. అంతేకాదు తమ గొప్పతనం ఏమిటో ప్రపంచానికి తెలియాలి అంటూ సృష్టికి వ్యతిరేకంగా పని చేయడం ప్రారంభించాయ్.

ఆకాశం తనలో పక్షులను ఎగరనివ్వలేదు. మేఘాలను తనలో సంచరించినివ్వలేదు. గాలి వీచడం ఆపేసింది. నీరు తుఫానులతో విరుచుకు పడింది. నదులను పారనీయలేదు. నదుల్లో సముద్రాల్లో నీటిని ఆవిరికానీయలేదు. ఆగ్ని కార్చిచు అయి భూమండాలన్నీ దహించింది. జీవులు తిన్న ఆహారం జీర్ణం కానిచచ్చేది కాదు. పంటలు పండడానికి, త్రాగటానికి నీరు లేకుండా చేసింది నీరు.భయంకరమైన భూకంపాలు పుట్టించింది భూమి.

పంచభూతాల ఈర్ష్య, ద్వేషం వలన భూమ్మీద అన్ని ప్రాణులకు పెద్ద కష్టం వచ్చింది. ప్రపంచం పీల్చేడానికి గాలిలేక, తాగటానికి నీరు లేక, తినటానికి తిండి లేక, ఉం డడానికి నిలువు నీడ లేక అల్లాడపోయింది. విలవిలాడింది. అన్ని ప్రాణులు బ్రహ్మ దేవుడు దగ్గరకు వెళ్లి తమకొచ్చిన పెద్ద కష్టాన్ని తొలిగించ మని వేడుకున్నాయి. జీవుల కష్టం కళ్లారా చుసిన బ్రహ్మ దేవుడు పంచభూతాలను రమ్మని కబురంపాడు. తనవద్దకు వచ్చిన పంచభూతలతో బ్రహ్మ ఇలా పలికాడు. "ఈ ప్రపంచంలో చిన్న పెద్ద పనులుండవు. మంచి పని, చెడ్డ పని ఉంటాయి. చేతికున్న ఐదు వేళ్ళల్లో ఏదీ గొప్పది? ఐదూ గొప్పవే. ఐదు వేళ్ళు కలిస్తేనే పిడికిలి. పంచభూతాలు ఐదు కలిసుంటేనే సృష్టి. మీ ఐదుగురు లేనినాడు సృష్టి లేదు, నేను లేను. ఇక నుంచి మీ ఐదుగురు గర్వం, అసూయలు వదిలి పరస్పరం సహకరించుకుంటూ సృష్టిని ముందుకు నడిపించాలని "హితబోధ చేశాడు.తమ తెలివితక్కువ తనానికి పంచభూతాలు సిగ్గుపడి, ఆ తరువాత నుండి పూర్వం కలిసిమెలిసి సృష్టిని ముందుకు నడిపించడంలో బ్రహ్మ దేవునికి సాయం చేశాయి.

**రాళ్లబండి సంగంనాయుడు**

**:9490935258**










మగని కాలమందు మగువ కష్టించిన
సుతుల కాలమందు సుఖమునందు
కలిమి లేమి రెండు గల వెంతవారికి
విశ్వదాభిరామ! వినుర వేమ!

భర్తకాలంలో కష్టపడి గృహాన్ని కాపాడుకుంటే, కొడుకులు పెద్దవారైనప్పుడు సుఖపడవచ్చు. ఎంతవారికైనా కలిమి, లేమి రెండూ జీవితంలో వస్తాయి.

సూర్య
www.suryaa.com
28.9.2025

# టీనేజ్ ప్రేమ & మానసిక ఆరోగ్యం



యుక్తవయసులో కలిగేది ప్రేమా? ఆకర్షణా... ఎన్ని తరాలు మారినా జవాబు దొరకని ప్రశ్న. వాళ్లేమో ప్రేమంటారు. అమ్మానాన్నలేమో కాదంటారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా కనిపించని వారధి ఏర్పడుతుంది. మానసా.. చాలా చురుకైన, అందమైన అమ్మాయి. ఎవరితోనైనా ఇట్టే కలిసిపోతుంది. అందుకే తనని ఇష్టపడనివారే ఉ ండరు. అలాంటిది ఈ మధ్య ఎవరితోనూ కలవట్లేదు. దిగులుగా ఉంటోంది. ఏమైందని అడిగితే నోరు విప్పదు. చివరికి అమ్మానాన్న ఎంతో బుజ్జగించగా చెప్పింది... 'నేనొక అబ్బాయిని ప్రేమించా. తనని చూడకుండా క్షణం కూడా ఉండలేకపోతున్నా'నని. ఆ మాట వినగానే ఖంగుతిన్నారా అమ్మానాన్నలు. తనకి పదిహేనేళ్లే మరి!

టీనేజ్ అనేది వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమైన దశ. ఈ సమయంలో శారీరకంగా, హార్మోన్లలో, భావోద్వేగాల్లో, ఆలోచనా విధానంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయి. ఆ మార్పులు సహజమైనవే అయినప్పటికీ, వాటిని అర్థం చేసుకోవడంలో టీనేజర్లు వారి తల్లిదండ్రులు కష్టపడతారు. దాన్ని అర్థం చేసుకుని జాగ్రత్తగా మసలుకోవాల్సింది పెద్దలే!ముఖ్యంగా "ప్రేమ" అనే భావన ఈ వయసులో ఎక్కువగా ఉ త్పన్నమవుతుంది. ఇది నిజమైన ప్రేమనా? లేక తాత్కాలిక ఆకర్షణా? అనే ప్రశ్న తరచుగా ముందుకొస్తుంది.

అందుకనే యుక్తవయసుని "ఒత్తిడి– తుఫాను" దశగా చెబుతుంటారు.

**టీనేజ్ ప్రేమ వల్ల కలిగే కారణాలు**

1. హార్మోన్ల ప్రభావం – డోపమిన్, ఆక్సిటోసిన్ వంటి హార్మోన్లు పెరగడం వలన ఒకరిపై బలమైన ఆకర్షణ ఏర్పడుతుంది.
2. ఐడెంటిటీ శోధన – "నేను ఎవరు?", "నన్ను ఎవరు అర్థం చేసుకుంటారు?" అనే ప్రశ్నలకు సమాధానం వెతుకుతారు. ఈ సమాధానం కోసం ఒక ప్రత్యేక వ్యక్తి మీద ఎక్కువగా ఆధారపడతారు.
3. ఎమోషనల్ ఇంపల్సివిటీ – ఎక్కువగా ఆలోచించకుండా భావోద్వేగాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం.

ప్రేమ పేరుతో కలిగే మానసిక సమస్యలు

స్ట్రెస్ మరియు ఆందోళన – తిరస్కరణ లేదా బ్రేకప్ జరిగితే గాఢమైన నిరాశ, డిప్రెషన్.

అకాడమిక్ డిస్ట్రాక్షన్ – చదువుపై దృష్టి తగ్గడం, భవిష్యత్తు పై ప్రతికూల ప్రభావం.

లో సెల్ఫ్–ఎస్టీమ్ – "అతను, ఆమె లేకుండా నేను జీవించలేను" అన్న భావనతో ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం.

సోషల్ ఐసోలేషన్ – స్నేహితులు, కుటుంబ సభ్యులను దూరం పెట్టడం.పాజిటివ్ వైపు కూడా ఉ ంది

టీనేజ్ ప్రేమ పూర్తిగా ప్రతికూలం కాదు. సరైన మార్గదర్శకత్వం ఉంటే ఇది:

కేరింగ్, అర్థం చేసుకునే స్వభావాన్ని పెంచుతుంది.

లి కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది.

సెల్ఫ్–అవగాహనను పెంచుతుంది.

**సూచనలు**

1. సెల్ఫ్–అవేర్నెస్ పెంచుకోవాలి – ఇది నిజమైన ప్రేమా? లేక తాత్కాలిక ఆకర్షణా? అని ఆలోచించాలి.
2. బౌండరీస్ సెట్ చేసుకోవాలి %–% ప్రేమ చదువు, కెరీర్, కుటుంబం కంటే పెద్దది కాదని గుర్తుంచుకోవాలి.
3. ఎమోషనల్ రెగ్యులేషన్ ప్రాక్టీస్ చేయాలి %–% నిరాశ, బ్రేకప్ వంటి సందర్భాల్లో మైండ్ని బ్యాలెన్స్ చేయడానికి మెడిటేషన్, స్పోర్ట్స్, హాబీస్ ఉ పయోగపడతాయి.
4. గైడెన్స్ తీసుకోవాలి – నమ్మకమైన పెద్దలతో లేదా సైకాలజిస్టుతో మాట్లాడడం ద్వారా సపోర్ట్ పొందాలి.

**తల్లిదండ్రులకు సూచనలు**

– పిల్లల భావోద్వేగాలను తప్పుగా తీసుకోవద్దు.
– కోపం, శిక్ష, ఎద్దేవా చేయడం వల్ల పిల్లలు అన్నీ దాచేస్తారు.
– వారితో స్నేహపూర్వక సంభాషణ కొనసాగించాలి.
– ఒకవేళ బ్రేకప్ లేదా నిరాశ వచ్చినా వారిని కించపరచకుండా అండగా ఉంటామన్న భరోసానివ్వండి. సహానుభూతితో వారిని దగ్గరకు తీసుకోండి.
– ప్రాథమిక సెక్స్ ఎడ్యుకేషన్ కలిగే ఆకర్షణల గురించి నెమ్మదిగా చెప్పండి.
– జీవితంలో ప్రేమ, పెళ్లి కంటే ఆశయాలు, లక్ష్యాలు ఎంత ముఖ్యమో చెప్పండి.
– ఎలాంటి పరిస్థితిలోనైనా మీతోడు ఉంటుందన్న ధైర్యాన్నివ్వండి.
– ఇంట్లోవాళ్లకు తెలిసినా 'క్రష్', 'ప్రేమ' అని నిర్భయంగా చెబుతున్నారు. ఈ సమయంలోనే సంయమనం పాటించాలి. – – టీనేజీ దశలో మన ప్రవర్తనే పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుంది.
– అవసరమైతే కౌన్సెలింగ్ సహాయం అందించాలి.

టీనేజ్ ప్రేమను పూర్తిగా తప్పు అనడం సరైంది కాదు. అది ఒక సహజమైన దశ. కానీ దానిని జీవిత నిర్ణయాల కంటే పెద్దదిగా తీసుకుంటే అది మానసిక ఆరోగ్యం, భవిష్యత్తు రెండింటినీ దెబ్బతీస్తుంది.

పేమ అనేది జీవితంలోని ఒక భాగం మాత్రమే... టీనేజ్ దశలో తల్లిదండ్రులు చూపే అవగాహన, సహనం, మార్గదర్శకత్వమే పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుంది.



**. డా హిప్నో పద్మ కమలాకర్**
**సైకాలజిస్ట్ & హిప్నో థెరపిస్ట్**
**హైదరాబాద్ - 93900 44031**

# రక్త క్యాన్సర్ వేచి ఉండదు - మీరు కూడా ఆలస్యం చేయకూడదు

వైద్యంలో సమయం అమూల్యం. ముఖ్యంగా రక్త క్యాన్సర్ వంటి వ్యాధుల విషయంలో ఇది మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఇది చాలా వేగంగా ముందుకు సాగి, ప్రారంభ దశలో గుర్తించబడకపోతే మరింత ప్రమాదకరంగా మారుతుంది. భారతదేశంలో ల్యూకీ మియా, లింఫోమా, మైలోమా వంటి రక్త క్యాన్సర్లు అన్ని వయస్సులలో గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి. భారతీయ వైద్య పరిశోధనా మండలి నివేదికల ప్రకారం, ఎక్కువ కేసులు ఆలస్య దశల్లోనే గుర్తించబడుతున్నాయి. ఫలితంగా చికిత్స క్లిష్టతరం అవుతుంది, బతికే అవకాశాలు తగ్గుతాయి. అయినప్ప టికీ, ఆధునిక చికిత్సలు మరియు పెరుగుతున్న ప్రజల అవగాహనతో, ఈ వ్యాధి పట్ల ఆశాజనకమైన మార్పు కనిపిస్తోంది.



**రక్త క్యాన్సర్ ఏమిటి?**

రక్తాన్ని తయారు చేసే కణజాలాలలో ఉద్భవించే దుష్టకణజాలాలను రక్త క్యాన్సర్ అంటారు.

ల్యూకీమియా – అసాధారణ శ్వేత రక్తకణాలు పెరిగి, ఆరోగ్యకరమైన రక్తకణాలను తగ్గించి, రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి.

లింఫోమా – లింఫాటిక్ వ్యవస్థపై దాడి చేసి, లింఫ్ నోడ్లు ఉబ్బడం కలిగిస్తుంది.

మైలోమా – ఎముక మజ్జలోని ప్లాస్మా కణాలను ప్రభావితం చేసి, ఎముకలు బలహీనమవ్వడం, రోగనిరోధక శక్తి తగ్గడం కలిగిస్తుంది.

**కారణాలు:** కిరణాలు, బెంజీన్ వంటి రసాయనాలు, జన్యుపరమైన అంశాలు, ధూమపానం వంటి జీవనశైలి కారణాలు. పట్టణాల్లో కాలుష్యం, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం రసాయనాల వాడకం ఇవన్నీ ప్రమాదాన్ని పెంచుతాయి.

**హెచ్చరిక సంకేతాలు** రక్త క్యాన్సర్ లక్షణాలు చాలా సార్లు సాధారణ రుగ్మతలతో మిళితమై ఉంటాయి:

నిరంతర అలసట / తరచూ సంక్రమణలు/ చిన్న గాయాలకే అసాధారణ రక్తస్రావం లేదా మచ్చలు / మెడ, చేతి గుంతలు, తొడల దగ్గర లింఫ్ నోడ్లు ఉబ్బడం/ రాత్రి చెమటలు, ఆకస్మిక జ్వరం, అప్రత్యక్ష బరువు తగ్గడం/ ఎముక నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మం పసుపు వర్ణం

లక్షణాలు రెండు వారాల కంటే ఎక్కువగా ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా అవసరం.

**ముందుగానే గుర్తించడం ఎందుకు ముఖ్యం?**

వైద్య సలహా ఆలస్యం అయితే, రక్త క్యాన్సర్ క్లిష్ట దశలకు చేరి రక్తహీనత, అవయవ నష్టం, తీవ్రమైన సంక్రమణలు కలిగిస్తుంది. ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయవంతమవుతుంది, దుష్ప్రభావాలు తగ్గుతాయి.

**భారతదేశంలో చికిత్సా అవకాశాలు**

కీమోథెరపీ – వేగంగా పెరిగే క్యాన్సర్ కణాలను లక్ష్యం చేస్తుంది.

ఇమ్యూనోథెరపీ మరియు మోనోక్లోనల్ యాంటీబాడీలు – ఖచ్చితమైన లక్ష్యంతో తక్కువ దుష్ప్రభావాలు కలిగిస్తాయి.

CAR-T సెల్ థెరపీ (NexCAR19, 2024లో ఆమోదం పొందింది) –రోగి రోగనిరోధక కణాలను మార్చి క్యాన్సర్పై పోరాడేలా చేస్తుంది.

స్టెమ్ సెల్ ట్రాన్స్ప్లాంట్ – అనుకూల రోగులలో నయానికి దారి తీస్తుంది.

సహాయక సంరక్షణ – రక్త మార్పిడి, నొప్పి నియంత్రణ వంటివి రోగి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

**నిరోధక చర్యలు :** ప్రతి సంవత్సరం ఆరోగ్య పరీక్షలు (ప్రత్యేకించి 40 ఏళ్లు పైబడిన వారికి లేదా కుటుంబ చరిత్ర ఉన్నవారికి).ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు స్క్రీనింగ్ అవకాశాలను అందిస్తున్నాయి. హెపటైటిస్ వంటి సంక్రమణలకు వ్యాక్సినేషన్ తీసుకోవడం.

**సారాంశం:** రక్త క్యాన్సర్ కోసం ఎదురుచూడకండి. లక్షణాలను నిర్లక్ష్యం చేయకండి. అవగాహన, ముందస్తు పరీక్షలు, సమయానికి వైద్య సహాయం %–% ఇవన్నీ రోగికి కొత్త ఆశలు అందిస్తాయి. భారత దేశంలో రక్త క్యాన్సర్ చికిత్స భవిష్యత్తు ఇప్పుడు ఆసుపత్రులు మరియు ఇళ్లలోనే వ్రాయబడుతోంది.



**డాక్టర్ పి. అమర్నాథ్, కన్సల్టెంట్ -**
**హీమటాలజిస్ట్, హెచ్‌సి క్యాన్సర్ సెంటర్**
**విజయవాడ**

సూర్య
www.suryaa.com
28.09.2025
ఆదివారం అనుబంధం

# మా కళాశాల...ఒక ఓపెన్ చెరసాల....




నేను 1983 లో ఏపీ గురుకుల జూనియర్ కళాశాల, నాగార్జున సాగర్ లో సీటు దొరికింది అని తెలిసిన వెంటనే ఇదే ఫీల్ అయ్యాను. రాష్ట్రంలో అప్పటికి అదొక్కటే ఆ తరహా కళాశాల. రాష్ట్ర స్థాయి ర్యాంకుల్లో ఎప్పుడూ నెంబర్ వన్.అందువల్ల ఒక వైపు ఆనందం.ఇంకోవైపు కించిత్ గర్వం.. అందరి అభినందనలు అందుకుంటూ ఉద్వేగం..లైఫ్ సెటిల్ అయిపోతుందని ధైర్యం.స్కూల్ లో విన్నంత మేరకు, ర్యాగింగ్ ఉ ంటుందేమోనని..సందేహం.వెరసి నవరసాలతో ఆ మూల ఉ త్తరాంధ్రలోని మారుమూల పల్లె సాలూరు నుండి పల్నాడు చివర నాగార్జున సాగర్ కి పయనం సాగింది. అంతవరకూ తాడికొండ గురుకుల పాఠశాల లో గడిపిన మూడేళ్ల రోజుల్ని సెంట్రల్ జైలు గా భావించిన నేను,' ఇంతకు మించి ఏముంటుంది లే ,బహుశా ఓపెన్ జైలు లా ఉండొచ్చు' ని అనుకుంటూ కాలేజీలో అడుగుపెట్టాను.

అంతదాకా,అంటే స్కూల్ లో, మిత్రులతో బాగానే కలిసిపోయినా, అక్కడి క్రమశిక్షణ, జీవితంలో మొదటిసారి ఇంటికి చాలా దూరంలో ఉ ండాల్సిరావడం, ఊరి బడిలో ఆముదం వృక్షం లా బతికి,ఇక్కడ మామూలు మొక్కయిపోవడం కొంచెం ఇబ్బందిగా ఉండేది.నిరంతరం హోమ్ సిక్ నెస్ పీడిస్తుండేది.ఉన్నంతలోనే అల్లరి,ఉపశమనం వెతుక్కొనేది. అలాంటి స్థితి నుండి జూనియర్ కళాశాల కు రావడం జరిగింది.అయితే వారంలోనే అది ఓపెన్ చెరసాల కాదు,ఉత్తమ భవిష్యత్ తయారీ శాల అని అర్థమై గొప్ప ఊరట కలిగింది.ఊరట కాదు..ఉ త్సాహం.హోమ్ సిక్ అన్న పదమే మరిచిపోయినంత. అన్నిటికన్నా అప్పుడు నాకు బాగా నచ్చిన విషయం ప్రతీ ఆదివారం సెలవు కావడం, ఆరోజు బయట తిరగడం నిషేధం కాకపోవడం.ఒక్క సారి రెక్కలు వచ్చిన ఫీలింగ్.ఆదివారం తో బాటు,పండగ సెలవొస్తే చాలు...

విజయపురి సౌత్‌లో రామకృష్ణ థియేటర్,అందులోంచి ఆట మొదలవ్వ డానికి ముందు వినిపించే నమో వేంకటేశ పాట తెచ్చిన ఉత్సాహం, భాను వీడియో అంటూ బస్టాండ్ దగ్గర ఉన్న వీడియో థియేటర్, డామ్ కి అటు చివర మూడు కిలోమీటర్ల దూరంలోని హిల్ కాలనీ వరకూ క్రమం తప్పని పాదయాత్ర అన్నీ నిన్నమొన్నటి విషయాల్లాగానే ఉన్నాయి తప్ప మధ్యలో రెండుతరాల కాలం గడిచిపోయినట్లు లేదు.

ఇక,మా సీనియర్ లెవ్వరూ ర్యాగింగ్ చెయ్యలేదు..కాకపోతే అందరినీ సర్ అని పిలవాలి..ఒక్క సంవత్సరమే పెద్ద అయినా.ఆ రెండు సంవత్సరాలు మంచి మిత్రులు,మంచి అనుభవాలు,రానున్న భవిష్యత్ కి పునాది వేశాయి.మా బోటనీ సర్ సత్యనారాయణ రెడ్డి గారు ఎప్పుడూ ' ఇలాగే చదువు, నువ్వు డాక్టర్ అయిపోయినట్టే ' అంటూ ప్రోత్సహించే వారు.అభిమానం కనబడేది.రెండు సార్లూ టీచర్స్ డే కి నేను బోటనీ క్లాస్ తీసుకున్నాను.( పిల్లలతో ఆ రోజు చెప్పించేవారు).క్లాస్ లాస్ట్ లో ఆయన్ని అనుకరిస్తూ గొంతు మార్చి కామెడీ చేస్తే ఒక్కడు కూడా నవ్వలేదు.ఏమిటా అని చూస్తే ఆయన ఎప్పుడు వచ్చి కూర్చున్నారో తెలియదు కానీ లాస్ట్ బెంచ్ నుండి లేచి వచ్చారు.బిక్క చచ్చిన నన్ను వెరీ గుడ్ అంటూ కదిలిపోయారు. ఇంకోసారి ఇంగ్లీష్ సర్ దివాకర్ గారు బోర్డు వైపు తిరిగి క్లాస్ చెప్తుంటే ఏదో చిన్నతనపు అల్లరి చేశాం.ఆయన చూడలేదనుకున్నాం. కానీ ముద్దాయిలందరినీ లేపారు.నన్నులేపి ' చేసిందంతా చేసి,ఎంత అమాయకపు మొహం పెట్టావు రా నాయనా' అని నవ్వి, తర్వాత ఈజీ గా తీసుకున్నారు. తాడికొండలోనే పనిచేసి ట్రాన్స్ఫర్ పై వచ్చిన పీడీ సర్,పాపయ్య రాజు గారు ఉదయాన్నే మా వింగ్ లో అందరినీ లేపి గ్రౌండ్‌కి పరిగెత్తించే డ్యూటీ నాకే ఇచ్చారు.. దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్టు.అందరూ ఫ్రెండ్లీ గా ఉండేవారు.చదువు చెప్పడం తో బాటు ప్రశ్నించడాన్ని ప్రోత్సహించేవారు.

టీచర్స్ అంటే, ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి గారితో సహా,వారి పట్ల పిల్లలందరికీ ఎంతో గౌరవం ఉండేది గానీ భయం ఉండేది కాదు.అది వారి గొప్పదనం.చాలా చిక్కని స్నేహాలు.అరమరికలు లేనివి. ఇంట్లోంచి తెచ్చుకున్న ఊరగాయలు, జంతికలు ఉమ్మడి ఆస్తి.కలిసి పోటీగా చదువుకోవడం,ఒకరి డౌట్లు ఒకరు తీర్చుకోవడం మాత్రమే కాదు...ఆటలైనా,పాటలైనా,షికార్లయినా, జట్లు గానే.రష్యా,ఉక్రెయిన్ స్థాయిలో గొడవపడినా రెండో రోజుకి సంధి కుదిరిపోవాల్సిందే.

ఒక హోలీ రోజు రంగులు పూసుకుంటూ నిలబడి చూస్తుండగా నన్ను ఒక్క సారిగా నలుగురు వెనక నుండి వచ్చి నీళ్ల టబ్బులో ఎత్తి పడేశారు. ముంచి ముంచి పడేశారు.

ఇంకోసారి సెలవులు ఇచ్చిన టైమ్ కి వరదలు.ట్రైన్లు లేక బస్సుల్లో బయలుదేరాం.అవి కూడా డైరెక్ట్ గా లేవు.ఉత్తరాంధ్ర వాళ్ళం నలుగురం కలిసి రాజమండ్రి చేరుకున్నాం.ఎవరిదగ్గరా డబ్బులు మిగల్లేదు.అయినా భయం లేదు.అందులో రవి ది వైజాగ్.ధైర్యం చెప్పాడు..నా చేతికి వాచీ ఉందిరా,ఏం ఫర్వాలేదు అని.

బస్టాండ్ లో ఒకాయన్ని పరిచయం చేసుకుని,పరిస్థితి చెప్పి మా నలుగురికీ టికెట్స్ తీయమని చెప్పాడు.తన వాచీ ఉంచుకుంటే,తర్వాత రోజు కలిసి డబ్బులిచ్చి రిటర్న్ తీసుకుంటానన్నాడు.ఆయన' అదేమీ వద్దులే ' అని చెప్పి మాకు టికెట్స్ తీసి ఇచ్చాడు. మేం వైజాగ్ లో రవి ఇంటికి చేరిపోయి,వారి ఆతిథ్యం పొంది,నెక్స్ట్ డే మా ఇళ్లకు చేరాం.

ఇంకోసారి నేను సెలవుల నుండి కాలేజీ కి వచ్చినపుడు బస్ పైలాన్ వైపు అర్ధరాత్రి దింపింది.చేతిలో భారీ లగేజీ.డామ్ కి మూడు కిలోమీటర్ల అటువైపు హాస్టల్. వెళ్ళేందుకు ఏ వాహనమూ లేదు.అటుగా వెళ్లే లారీలు ఎక్కడికి అని అడిగి మరీ ' మేం రాం' అని అంటున్నారు.లాభం లేదని ఒక లారీ వస్తే,మాచర్ల కు అని చెప్పి ఎక్కేసాను.దారిలో ' కాదు, విజయపురి సౌత్ ' కి అని చెప్తే డ్రైవర్ కి కోపం వచ్చింది.లారీ ఆపేసి ' నిన్ను ఈ సాగర్ లో పడేస్తే దిక్కేంటని 'గదమాయించి, మాచర్ల కి సరిపడా టికెట్ డబ్బులు తీసుకున్నాడు.నేను దిగి నడిచి వస్తుండగా మళ్ళీ లారీ ఆపి,డబ్బులు వెనక్కి ఇచ్చి ' ఇలా అబద్ధాలు ఆడకు' అని తిట్టి వెళ్ళాడు.ఒక సారి ఒక మిత్రుడు పక్కనే ఉన్నాడని గమనించక మిగతా వాళ్లం వాడి మీద తెగ చాడీలు మాట్లాడాం.తర్వాత తీరిగ్గా వాడు రూమ్ లోంచి వచ్చాడు.అదో జీవిత పాఠం.సబ్జెక్ట్ దరిదాపుల్లో లేదని ఎప్పుడూ రెండు మూడు సార్లు కన్ఫర్మ్ చేసుకున్నాకే చాడీలు చెప్పాలని.ఇలా చెప్తూ పోతే బోలెడు.నా పేరు అచ్చులో చూసుకోవడం మొదటిసారి అక్కడే.ఆశాజీవులు అని కవిత రాస్తే ఆ సంవత్సరం మేగజైన్ లో అచ్చయింది.చదువుతో బాటు అందమైన అనుభవాలు,స్నేహాలు,జీవిత పాఠాలు మిగిల్చిన మా ఏపీ గురుకుల జూనియర్ కళాశాల మా అందరికీ ఉన్నతి కలుగ జేసిన మేధో తయారీ శాల.(1975 లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నెలకొల్పబడ్డ ఏపీ గురుకుల జూనియర్ కళాశాల ఈ ఏడు ఏభై సంవత్సరాల వేడుక జరుపుకోబోతోంది.వేలాది మంది విద్యార్థుల్ని దేశవ్యాప్తంగా ఉన్నత స్థానాల వైపు నెట్టిన ఈ ప్రతిష్టాత్మక విద్యా సంస్థ నేటికీ తన గొప్పదనం నిలుపుకుంటూనే ఉంది.)

**డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ. 9440836931**

# పేదరికం నుండి విముక్తి

**( పల్లా వెంకట రామారావు– 9949043019)**

వాసు పాతికేళ్ళ కుర్రాడు. పుట్టుకతోనే పేదరికం వాడి వెన్నంటే ఉ ంది. పొద్దుటి నుండి సాయంత్రం వరకు కష్టపడి కూలి పని చేస్తాడు. రోజంతా ఎండలో, వానలో కష్టపడి సంపాదించిన డబ్బు తొందరగా ఖర్చైపోతుంది. అప్పుడప్పుడు ఏదైనా ఆదా చేద్దామనుకున్నా, ఇంట్లో ఏదో ఒక అవసరం వచ్చి పడుతుంది. అనారోగ్యాలు, పండుగలు, ఇంటి అవసరాలు... ఇలా ఏదో ఒక రూపంలో డబ్బు వచ్చి, పోతుంది తప్ప, వాసు చేతిలో నిలవదు.

"నేనెందుకు ఇలా పేదవాడిగానే మిగిలిపోతున్నాను? ఎంత కష్టపడినా నా పరిస్థితి ఎందుకు మారడం లేదు?" అని తనను తాను ప్రశ్నించు కునేవాడు వాసు. ఒకరోజు తన బాధను ఒక గురువుగారికి చెప్పుకోవాల ను కున్నాడు. ప్రొద్దుటూరులో ఉన్న ఒక జ్ఞానవంతులైన గురువుగారి దగ్గరికి వెళ్ళి, తన గోడు వెళ్ళబోసుకున్నాడు.

"గురువుగారు, నేను ఎంత కష్టపడినా పేదరికం నన్ను వదలడం లేదు. నేను కూలి పని చేస్తాను, కష్టపడి సంపాదిస్తాను. కానీ నా డబ్బు ఎప్పటికప్పుడు ఖర్చైపోతుంది. నేనెందుకు ఈ పేదరికాన్ని దాటి వెళ్ళలేక పోతున్నాను?" అని దీనంగా అడిగాడు వాసు.

గురువుగారు వాసు మాటలు విన్న తర్వాత చిరునవ్వు నవ్వి, "వాసు! నీ పరిస్థితి నాకు అర్థమైంది. నీవు కష్టపడుతున్నావు. అందులో సందేహం లేదు. కానీ నీవు ఎందుకు పేదరికాన్ని దాటలేకపోతున్నావో తెలుసా? నీకు సంపాదన ఉన్నా, ప్రణాళిక లేదు. రేపటి గురించి ఆలోచించడం లేదు. నీకు ఉన్నది ఈ రోజు మాత్రమే అనుకుంటున్నావు" అని అన్నారు.

"అంటే గురువుగారు?" అర్థం కానట్లు చూశాడు వాసు.

"చూడు వాసు! నీవు కూలి పని చేస్తున్నావు. ఇది తాత్కాలికమైన సంపాదన. నీకు ఒక స్థిరమైన ఆదాయ మార్గం లేదు. ఒక చిన్న మొ-త్తమైనా ఆదా చేయడం నేర్చుకో. నీ ఖర్చులను తగ్గించుకో. అనవసర మైన వాటికి డబ్బు వృథా చేయకు. ముఖ్యంగా నీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించు. ఆరోగ్యం పాడైతే సంపాదన కూడా ఉండదు."

గురువుగారు ఇంకా ఇలా కొనసాగించారు "నీకు తెలిసిన పనిలో నైపుణ్యాన్ని పెంచుకో. ఒకవేళ కూలి పని కాకుండా, వేరే ఏదైనా చిన్న పని నేర్చుకోవాలనుకుంటే, దానికి ప్రయత్నించు. ఉదాహరణకు, ఒక కుమ్మరి పని, లేదా బట్టలు కుట్టడం, లేదా ఏదైనా చిన్న వ్యాపారం, ఇవి నీకు దీర్ఘకాలికంగా ఉపయోగపడతాయి. అదనపు ఆదాయం సంపాదించుకునే మార్గాలను వెతుకు. కేవలం ఒకే ఆదాయం మీద ఆధారపడకు"

"అంతేకాదు, నీవు ఇతరులకు సహాయం చేయడానికి కూడా ప్రయత్నించు. నీ దగ్గర ఎక్కువ లేకపోయినా, నీకు చేతనైనంత సహాయం చెయ్యి. మాటసాయమో, ఉపయోగపడే పని ఏదైనా చేస్తే అది నీకు మానసిక సంతృప్తిని ఇస్తుంది. అంతేకాదు నీవల్ల సహాయం పొందిన వారి స్నేహం, కృతజ్ఞత ఏదో ఒక రోజు నీకు ఉపయోగపడతాయి"

గురువుగారు చివరిగా ఇలా అన్నారు, "పేదరికం అనేది కేవలం డబ్బు లేకపోవడం కాదు, అది ఆలోచన విధానం కూడా. నీ ఆలోచనలను మార్చుకుంటే, నీ పరిస్థితి కూడా మారుతుంది. నీవు చేయగలవని నమ్ము. ప్రణాళికతో ముందుకు వెళ్ళు. రేపటి గురించి ఆలోచించు. అప్పుడే నీవు ఈ పేదరికాన్ని దాటి, ఒక మంచి జీవితాన్ని గడపగలవు."



గురువుగారి మాటలు వాసు మనసును తాకాయి. తన తప్పు ఎక్కడ ఉ ందో అతనికి అర్థమైంది. అప్పటి నుండి వాసు తన జీవన విధానాన్ని మార్చుకున్నాడు. అనవసరమైన ఖర్చులను తగ్గించాడు. కొద్ది మొత్తమైనా ఆదా చేయడం మొదలుపెట్టాడు. తన కూలి పనితో పాటు, సాయంత్రం వేళల్లో ఒక దర్జీకి సహాయం చేస్తూ, అదనంగా డబ్బు సంపాదించడం మొదలుపెట్టాడు. తన నైపుణ్యాలను పెంచుకోవడా నికి ప్రయత్నించాడు. క్రమంగా, వాసు జీవితంలో మార్పు రావడం మొదలైంది. పేదరికం నుండి బయటపడి, ఒక గౌరవప్రదమైన జీవితాన్ని గడపగలిగాడు.

సూర్య
www.suryaa.com
28.9.2025



# శతవసంతాల ఆర్‌ఎస్‌ఎస్

**27 సెప్టెంబర్ 1925న స్థాపించబడినప్పటి నుండి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తన ప్రభావాన్ని నిరంతరం విస్తరిస్తూ, దాని కార్యకలాపాల గురించి తెలుసుకోవడానికి మరియు అర్థం చేసుకోవడానికి ప్రజలలో ఉత్సుకతను రేకెత్తించింది. ఆర్ఎస్ఎస్ తన 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులను మరియు సవాళ్లను ఎదుర్కొంది. ఇంత సుదీర్ఘ కాలం పాటు సామాజిక మరియు సాంస్కృతిక రంగాలలో పనిచేయడం కత్తి మీద సాము లాంటిదే. ఈ దృక్కోణం నుండి, దీనిని ప్రపంచ వేదికపై నిస్సందేహంగా ఒక ప్రత్యేకమైన సంస్థగా పరిగణించవచ్చు.**

ఆర్‌ఎస్‌ఎస్ను అర్థం చేసుకోవడానికి, సంస్థ వ్యవస్థాపకుడు, ప్రప్రథమ సర్ సంఘ్చాలక్ డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ను అర్థం చేసుకోవడం చాలా అవసరం. స్వాతంత్ర్యం కోసం మాత్రమే ప్రయత్నించడం అంటే వ్యాధి మూల కారణాన్ని పరిష్కరించడం కంటే దాని లక్షణాలకు చికిత్స చేయడం లాంటిదని ఆయన నిశ్చితాభిప్రాయం. సమాజంలో స్వీయ-అవగాహన, ఆత్మగౌరవం, ఐక్యత, సోదర బంధం, క్రమశిక్షణ మరియు జాతీయభావం పెంపొందించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని ఆయన ప్రగాఢంగా విశ్వసించేవారు. ఆయన 1925వ సంవత్సరం విజయదశమి శుభ సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ను స్థాపించారు. ముఖ్యంగా వినాయక్ దామోదర్ సావర్కర్ ప్రతిపాదించిన హిందూత్వ భావన ద్వారా ప్రభావితమైన హెడ్గేవార్ ఆర్‌ఎస్‌ఎస్ ను ఒక ధార్మిక లేదా ఆధ్యాత్మిక సంస్థగానో కాకుండా "నమస్తే సదా వత్సలే మాతృభూమి" (ఓ పవిత్రమైన మాతృభూమి, నేను ఎల్లప్పుడూ నీకు నమస్కరిస్తాను) అనే ప్రేరణాత్మక గీతంతో జాతీయవాద సంస్థగా రూపొందించారు. రెండవ సర్ సంఘ్చాలక్గా, "గురూజీ"గా పిలువబడే మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్, సంస్థను దేశవ్యాప్తంగా, రాజకీయంగా ప్రభావవంతమైన ఉద్యమంగా విస్తరించడంలో ఖ్యాతినార్జించారు. 1940 నుండి 1973లో మరణించే వరకు సేవలందిస్తూ, ఆయన హిందూ జాతీయవాదం యొక్క సైద్ధాంతిక పునాదులను సుస్థిరం చేయడమే కాక సంఘ్ పరివార్ను రూపొందించే అనేక అనుబంధ సంస్థల సృష్టికి అధ్యక్షత వహించారు. సమాజంలో మార్పు కోసం ఆర్‌ఎస్‌ఎస్ ప్రత్యేకించి వ్యక్తి నిర్మాణం, శీలం, సౌశీల్యం ద్వారా జాతి నిర్మాణం కోసం కృషి చేస్తుంది. సేవ (%ూవతీజఱషవ%), సమర్పణ్ (%ణవసఱషఏఱశీఅ%), సంఘటన్ (%ూతీస్త్రుఅఱఓఏఱశీఅ%) మరియు అప్రతిమ్ అనుశాసన్ (%ఖఅటశ్రీఱఅఎష్ట్రవఅ ణవసఱషఏఱశీఅ%) స్వయం సేవకుల యొక్క ప్రధాన లక్షణాలు. 1951లో స్థాపించబడిన భారతీయ జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి రాజకీయ వాహనంగాను ఆ తరువాత 1980లో భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెందింది. 2014 నుండి మూడు పర్యాయాలు అప్రతిహతంగా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం వెనుక విడదీయరాని విధంగా ఆర్‌ఎస్‌ఎస్ కృషి ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ యొక్క విస్తారమైన మరియు క్రమశిక్షణ కలిగిన స్వయం సేవకులు బీజేపీకి అద్భుతమైన కేడర్ను మరియు బలమైన సైద్ధాంతిక పునాదిని అందిస్తారు.

### పుట్టగానే పరిమళించిన పువ్వు:

డాక్టర్ హెడ్గేవార్ జన్మతః దేశభక్తుడు అనేందుకు నిదర్శనంగా ఆయన చిన్ననాటి సంఘటనలు నిలుస్తున్నాయి. 22 జూన్ 1897న, ఆయనకు ఎనిమిదేళ్ల వయసున్నప్పుడు, విక్టోరియా రాణి పుట్టినరోజును భారతదేశమంతటా ఘనంగా నిర్వహిస్తూ మిఠాయిలు పంచుతుంటే పాఠశాలలో ఆయన కూడా తీసుకున్నాడు. కానీ అది బ్రిటన్ రాణి విక్టోరియా పుట్టినరోజు సందర్భంగా ఇచ్చారని తెలుసిన వెంటనే, "నేను ఆమెను నా దేశ రాణిగా భావించను" అని ఆ మిఠాయిని చెత్త కుప్పపై విసిరేశాడు. 1901లో ఆయనకు 12 సంవత్సరాలప్పుడు ఇంగ్లాండ్ కొత్త రాజుగా ఎడ్వర్డ్ కింగ్ సింహాసనాన్ని అధిష్టించాడు. ఈ సందర్భంగా భారతదేశమంతటా జరిగిన వేడుకలలో భాగంగా నాగ్పూర్లోని ఎంప్రెస్ మిల్ ప్రాంగణంలో జరుగుతున్న బాణాసంచా కార్యక్రమానికి హాజరయ్యేందుకు స్నేహితులు కోరినప్పుడు ఆయన "ఒక విదేశీయుడు రాజు అయినప్పుడు మనం ఎందుకు సంతోషించాలి?" అంటూ నిరాకరించాడు. మరో సంఘటనలో నాగ్పూర్లోని సీతాబర్డి కోటలో బ్రిటన్ జెండా - యూనియన్ జాక్ %-% ఎగురవేయడాన్ని ఇష్టపడని ఆయన హిందవి స్వరాజ్ చిహ్నమైన కాషాయ జెండాను దాని స్థానంలో ఎగురవేసేందుకు తన స్నేహితులతో కలిసి జెండాలు మార్చేందుకు ఒక ప్రణాళికను రూపొందించాడు. ప్రణాళికానుసారం కోటకు చేరుకునేందుకు తన సహచరులతో కలిసి సొరంగం తవ్వకం గురించి అతని పాఠశాల ఉపాధ్యాయునికి తెలిసి, అది చేయకుండా ఆయనను నిరోధించాడు. డాక్టర్ హెడ్గేవర్ బాల్యంలోని ఈ మూడు సంఘటనలు ఆయన దేశభక్తికి నిదర్శనంగా నిలవడమే కాక ఇతరులను కూడా ఈ మార్గం అనుసరించేలా చేస్తాయి.

### హిందూత్వం మరియు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల మధ్య సంబంధం:

విశ్వవ్యాప్తంగా భారతదేశం యొక్క గుర్తింపు ఆధ్యాత్మికత ఆధారిత మరియు "వసుధైక కుటుంబకం" భావనతో ప్రపంచంలోని ప్రజలందరూ ఒక కుటుంబంలా కలిసి జీవించాలన్న సమగ్రమైన దృక్పథంతో విడదీయరానిదిగా ఉంది. ఈ భావన హిందూత్వం లేదా హిందూ జీవిత దృక్పథంగా గుర్తింపు పొందింది. ఈ తత్వాన్ని పునరుజ్జీవింపజేయడం, సమాజం మొత్తాన్ని ఏకీకృతం చేయడం మరియు సమాజంలో సద్గుణం మరియు శ్రేష్ఠత యొక్క నమూనాను స్థాపించడం అనే లక్ష్యాలతో ఆర్‌ఎస్‌ఎస్ అంకురించింది. ఆయన కాలంలోని ప్రముఖ ఆలోచనాపరులు, మేధావులు మరియు నాయకులతో ఆయనకు సన్నిహిత అనుబంధాలు ఉన్నప్పటికీ, డాక్టర్ హెడ్గేవార్ దార్శనిక డాక్టర్ హెడ్గేవార్ దార్శనిక దృక్పథం, చతురత మరియు దూరదృష్టి ఆయనను ఆయన తన సమకాలీనుల నుండి వేరు చేసింది. గత వంద సంవత్సరాలలో, ఆర్‌ఎస్‌ఎస్ ఒక చిన్న, స్థానిక సంస్థ నుండి భారతదేశ ప్రజల జీవితాలలో





డాక్టర్ హెడ్గేవార్





దాదాపు ప్రతి కోణంలో ఉనికిని కలిగి ఉన్న విస్తారమైన, సంక్లిష్టమై న నెట్వర్క్గా పరిణామం చెందింది. సంఖ్యాపరంగా ఇది ప్రపంచం లోని అతిపెద్ద స్వచ్ఛంద సంస్థలలో ఒకటిగా మారింది.

**రక్షణ మరియు పునరావాస కార్యకలాపాలలో ఆర్ఎస్ఎస్ సేవలు:** 1999 ఒడిశా సూపర్ సైక్లోన్, 2001 గుజరాత్ భూకంపం, 2004 నాటి భీకర సునామీ, 2009లో దక్షిణ భారతదేశంలో వరదలు, 2013లో ఉత్తరాఖండ్ లో ఆకస్మిక వరదలు మరియు కొండచరియలు విరిగిపడినప్పుడు, 2015లో చెన్నై వరదలు, 2015లో నేపాల్ లో వినాశకరమైన భూకంపం, 2020%-%2022 మధ్య కోవిడ్-19 మహమ్మారి, మే 2024లో బంగ్లాదేశ్ తీరప్రాంతాలలో సైక్లోన్ రెమల్ తుఫాను, 2023లో ఉత్తర భారతదేశం మరియు రాజస్థాన్లోని అనేక రాష్ట్రాలలో వరదలు, 2023లో ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో జరిగిన ట్రిపుల్ రైలు ప్రమాదం అనంతరం జరిగిన ఘోర ఘర్షణ, 2023%-%2024లో మణిపూర్ లో జాతి హింస చెలరేగిన సందర్భంగా ఆర్ఎస్ఎస్ మరియు దాని అనుబంధ సంస్థలు నిస్వార్థంగా అందించిన సేవలు వారి సేవానిరతికి అద్దం పడతాయి.

**సేవాదర్పణం:** భారతదేశ విభజన సమయంలో హిందూ శరణార్థు లకు ఉపశమనం మరియు పునరావాసం కల్పించడంలో కీలక పాత్ర పోషించింది. 1947-48లో పాకిస్తాన్ జమ్మూ కాశ్మీర్ లోని పూంఛ్ సెక్టార్ లో మరియు 1962లో చైనా భారతదేశంపై దురాక్రమణకు పాల్పడినప్పుడు భారత సైన్యంతో స్వయం సేవకులు పాల్గొనడం విశేషం. అంతేకాదు, పూంఛ్ సెక్టార్ లో వాయుసేన విమా నాలు దిగేందుకు అనువుగా వారు స్వల్ప వ్యవధిలో ఒక ఎయిర్ స్ట్రిప్ కూడా నిర్మించారు. అంతేకాదు, ఇండో-చైనా యుద్ధం అనంతరం అధిక సంఖ్యలో సైనికులు సరిహద్దు భద్రతలో నిమగ్న మైన దరిమిలా, 1963 నాటి గణతంత్ర వేడుకలలో దాదాపు 3000 (సంఖ్యాపరంగా కొన్ని విభేదాలు ఉ ండవచ్చు) మంది స్వయం సేవకులు పాల్గొన్నారు. 1977లో సంభవించిన దివిసీమ తుఫాను కారణంగా ఏర్పడిన విలయతాండవం తరువాత భీతావహంగా గుట్టలుగుట్టలుగా పడివున్న శవాల వెలికితీతలో, వైద్య సిబ్బంది సైతం సంశయిస్తున్న సమయంలో, స్వయం సేవకులు శ్లాఘనీయమైన సేవలందించారు. అజ్ఞాతంగా సేవలందించేందుకు సంసిద్ధుల వడం తప్ప కీర్తి ప్రతిష్టల కోసం పాకులాడకపోవడం వారి ప్రత్యేకత. సర్వభావనసమానత్వంతో స్థాయీబేధాలు లేకుండా లక్ష్యసాధన కోసం కలిసికట్టుగా శ్రమించ డం ఆర్ఎస్ఎస్ నైజం. స్వాతంత్ర్యానం తర కాలంలో ఆర్ఎస్ఎస్ ప్రభావం "సంఘ్ పరివార్" అని పిలువబ డే అనుబంధ సంస్థల నెట్వర్క్ ద్వారా గణనీయంగా విస్తరించింది. దీని అనుబంధ సంస్థలలో సామాజిక సేవ, విద్య, శ్రమ మరియు రాజ కీయాలకు అంకితమైన విస్తృత శ్రేణి సంస్థలు ఉన్నాయి. వీటి లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), భారతీయ కిసాన్ సంఘ్ (బికెఎస్), భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్), సేవా భారతి, అఖిల భారతీయ విద్యార్థి పరిషద్ (ఏబివిపి) , విశ్వ హిందూ పరి షద్ (విహెచ్పి), బజరంగ్ దళ్, స్వదేశీ జాగరణ్ మంచ్ మరియు సరస్వతి శిశు మందిర్ లను ప్రముఖంగా ప్రస్తావించవచ్చు.



**మహనీయుల కితాబు:** మే 1939లో పూణేలో జరిగిన ర్యాలీ సందర్శన సందర్భంగా డా బాబా సాహెబ్ అంబేడ్కర్ "ఆర్ఎస్ఎస్ సభ్యులు కుల, మత బేధాలు ఏమాత్రం లేకుండా పూర్తి సమానత్వం మరియు సోదరభావంతో కలిసి సాగడం నన్ను ఆశ్చర్యచకితుడిని చేసింది" అని వ్యాఖ్యానించగా 16 సెప్టెంబర్ 1947న జరిగిన ఆర్ఎస్ఎస్ ర్యాలీ సందర్శన సందర్భంగా మహాత్మా గాంధీ "మీ సంస్థలో సభ్యుల క్రమశిక్షణ మరియు అస్పృశ్యతకు తావులేని వాతావరణం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది" అని అన్నారు. కాగా ఆర్ఎస్ఎస్ ప్రారంభించిన "స్వదేశీ సురక్ష అభియాన్" గురించి దేశ మాజీ ప్రధానమంత్రి చంద్రశేఖర్, ఇది కేవలం ఒక ఆర్థిక ఆందోళన కాదు, దేశ సమగ్రత మరియు గుర్తింపును కాపాడేందుకు చేపట్టిన ఒక అదుతమైన చర్య అని అభివర్ణించారు.



**సామాజిక సహకారాలు మరియు ప్రజా అవగాహన:** దశాబ్దాలుగా, ఆర్ఎస్ఎస్ విస్తృత శ్రేణి సామాజిక మరియు అభివృద్ధి కార్యక్రమా లలో నిమగ్నమై ఉంది. "సరస్వతి శిశు మందిర్" పాఠశాలలు ఆర్ఎస్-ఎస్ యొక్క విద్యా విభాగం అయిన "విద్యా భారతి"లో ఒక భాగం. స్వాతంత్ర్యానంతరం 1952 లో ఉత్తరప్రదేశ్లోని గోరఖ్పూర్లో మొదటి సరస్వతి శిశు మందిర్ స్థాపించబడింది. విద్యాభారతి వంటి సంస్థల ద్వారా, ఇది భారతదేశంలోని అతిపెద్ద పాఠశాలల నెట్వర్క్లలో ఒకదాన్ని నిర్వహిస్తుంది. విద్యాభారతి నిర్వహిస్తున్న సరస్వతి శిశు మందిర్ పాఠశాలలు, భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ పాఠశాల నెట్వర్క్లలో ఒకటి. ఇవి భారతీయ సంస్కృతితో కూడిన విలువ ఆధారిత విద్య మరియు వ్యక్తిత్వ నిర్మాణం అనే సూత్రాలపై స్థాపించబడ్డాయి. బాధ్య తాయుతమైన మరియు ఉపయోగకరమైన పౌరులను పెంపొందిం చడానికి ఈ పాఠశాలలు నైతిక విద్య, యోగా మరియు యుద్ధ కళలతో శారీరక విద్య మరియు సాంస్కృతిక అభివృద్ధిని నొక్కి చెబుతా యి. దీన్దయాళ్ పరిశోధనా సంస్థ వంటి దాని గ్రామీణ అభివృద్ధి కార్య్ర కమాలు గ్రామాల్లో స్వావలంబన మరియు స్థిరమైన అభివృది ్ధని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. విపత్తు ఉపశమనం మరియు పునరావాస కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ఈ సంస్థ అత్యంత విస్తృతంగా గుర్తింపు పొందింది. 1984 భోపాల్ గ్యాస్ విషాదం మొదలుకొని 2001 గుజరాత్ భూకంపం మరియు ఇటీ వలి కోవిడ్-19 మహమ్మారి వరకు, స్వయం సేవకులు మొదటి ప్రతి స్పందనదా రులలో (ఫస్ట్ రెస్పాండర్స్) ప్రభావిత వర్గాలకు కీలక మైన సహాయం మరియు మద్దతును అందించారు. కుల, మత, వర్ణ, వర్గ విబేధాలకు అతీతంగా విస్తృతమైన సామాజిక సేవ లో నిమగ్నమైనప్పటికీ ఆర్ఎస్ఎస్ తరచుగా వివాదం మరియు విమర్శ ల కు గురవుతోంది. ఈ కారణంగానే 1948లో నాథూరామ్ గాడ్సే ద్వారా మహాత్మా గాంధీ హత్య జరిగినప్పుడు, 1975 నాటి అత్యవసర పరిస్థితి మరియు 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత నేపథ్యంలో దీనిని భారత ప్రభుత్వం మూడుసార్లు నిషేధించింది. విమర్శకులు ఆర్ఎస్ఎస్ విభజన, మెజారిటీవాద ఎజెండాను ప్రోత హిస్తోందని మరియు మతపరమైన ఉద్రిక్తతలను పెంచుతుందని, మరియు మతపరమైన అల్లర్లలో దాని పాత్ర గురించి ఆరోపణలు చేసినప్పటికీ, న్యాయపరంగా సరైన ఋజువులు లేకపోవడంతో సంస్థ బహిష్కరణ న్యాయస్థానాలలో వీగిపోయింది.

**శతాబ్ది వేడుకలు:** ఆర్ఎస్ఎస్ తన శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరిం చుకుని, భారతదేశంలోని ప్రతి గ్రామం మరియు పట్టణ సమూహా లలో తన పరిధిని విస్తరించుకునే లక్ష్యంతో ఏడాది పొడవునా ప్రచారాన్ని కొనసాగించే ఒక భారీ ప్రణాళికను రూపొందించుకుంది. 2024లో విజయదశమి నాడు ప్రారంభమైన ఈ వేడుకలలో ఒక లక్ష కంటే ఎక్కువ సమావేశాలు, ఇంటింటికి బహిరంగ కార్యక్రమాలు మరియు జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై సెమినార్లు నిర్వహించేందుకు సంసిద్ధమయ్యింది. శతాబ్ది యొక్క కేంద్ర ఇతివృత్తమైన "సమగ్ర సామాజిక సమైక్యతను పెంపొందించడానికి సమగ్ర ప్రచారం" అనే లక్ష్య సాధన కోసం సామాజిక సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ స్పృహ, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం మరియు దేశభక్తి లాంటి "పంచ పరివర్తన"లకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకుంది. శత వసంతాలు పూర్తిచేసుకుంటున్న సంవత్సరంలో, ఉదయం సమావేశాలు జరిగే తన శాఖల సంఖ్యను 85,000 నుండి 100,000 కు పెంచాలని, 3 నుండి 4 మిలియన్ల కొత్త స్వయంసేవకులను చేర్చుకోవాలని తద్వారా మొత్తం స్వచ్ఛంద సేవకుల సంఖ్యను కోటికి పెంచాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ యేడాదితో మొదటి శతాబ్దం పూర్తి చేసుకుంటున్న ఆర్ఎస్ఎస్ భారతదేశ సామాజిక-రాజకీయ క్షేత్రంలో ఒక శక్తివంతమైన మరియు అత్యంత ప్రభావవంతమైన శక్తిగా మిగిలిపోయింది. ఈ స్వచ్ఛంద సంస్థ యొక్క అప్రతిహత ప్రయాణం భరతజాతి సాంస్కృ తిక పునరుజ్జీవనం, జాతీయవాద ఆకాంక్షలు మరియు దేశ రాజకీ య చర్చ మరియు భవిష్యత్తు పథంలో నిర్వచించే అంశంగా కొనసాగుతున్న సంప్రదాయవాద భావజాలం యొక్క సంక్లిష్ట పరస్పర చర్యను ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సంశయం లేదు.

**యేచన్ చంద్ర శేఖర్, మాజీ రాష్ట్ర కార్యదర్శి**
**ది భారత్ స్కౌట్స్ %డ% గైడ్స్, తెలంగాణ**
**హైదరాబాద్ - ✆ 8885050822**

ఆదివారం అనుబంధం

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

28.9.2025

## మనోధైర్యం, బలం నుండి ప్రశాంతతకు

# నవదుర్గల నుండి జీవిత పాఠాలు



***నవరాత్రి పండుగ సమయంలో నవదుర్గ, తొమ్మిది రూపాలు, పూజించ బడతాయి. దేవత యొక్క ప్రతి రూపం ఆమె శక్తి మరియు జ్ఞానం యొక్క ప్రత్యేక అంశాన్ని సూచిస్తుంది. నవదుర్గలు కేవలం దైవిక అస్తిత్వాలు మాత్రమే కాదు, మనం మానవులుగా మన జీవితాల్లో పెంపొందించుకోవడానికి ప్రయత్నిం చే లక్షణాలను కూడా కలిగి ఉంటారు. వారి కథలు ద్వారా, నవదుర్గలు బలం, ధైర్యం, జ్ఞానం మరియు ఆధ్యాత్మిక పెరుగుదల గురించి విలువైన పాఠాలను మనకు బోధిస్తారు. నవదుర్గ లక్షణాలను అర్థం చేసుకోవడం మరియు అనుకరించడం ద్వారా, మనం జీవితంలోని సవాళ్లను మరింత సులభంగా మరియు నమ్మకంగా ఎదుర్కోవచ్చు. ఈ వ్యాసంలో, నవదుర్గ యొక్క ప్రతి రూపం యొక్క ప్రాముఖ్యతను మరియు వాటి నుండి మనం నేర్చుకోగల పాఠాలను మనం తెలుసుకుంటాం. దుర్గాదేవి యొక్క 9 రూపాలలో వివరణాత్మక వర్ణన ..***

**మా శైలపుత్రి :** దుర్గాదేవి యొక్క మొదటి రూపం అయిన మా శైలపుత్రి, హిమాలయాల కుమార్తె మరియు బలం మరియు స్థిరత్వం యొక్క లక్షణాలను కలిగి ఉంటుంది. ఆమె తరచుగా ఎద్దుపై స్వారీ చేస్తున్నట్లు చిత్రీకరించబడుతుంది, ఇది ఆమె శక్తి మరియు బలాన్ని సూచిస్తుంది. మా శైలపుత్రి నుండి, మన మూలాలతో స్థిరంగా ఉండటం మరియు సిద్ధంగా ఉండటం యొక్క ప్రాముఖ్యతను మనం నేర్చుకుంటాము. ఆమె మన అంతర్గత బలాన్ని (అంటే మనలొ ఉన్న మనమే గమనించని బలం )ఎలా ఉపయోగించాలో మరియు పట్టుదల మరియు సంకల్పంతో సవాళ్లను అధిగమించాలని మనకు బోధిస్తుంది. మా శైలపుత్రి లక్షణాలను అనుకరించడం ద్వారా, మన జీవితాల్లో స్థిరత్వం మరియు బలాన్ని పెంపొందించుకోవచ్చు.
పాఠం: సవాళ్లను ఎదుర్కొనేటప్పుడు బలంగా, సిద్ధంగా మరియు స్థిరంగా ఉండండి.

**మా బ్రహ్మచారిణి :** దుర్గాదేవి యొక్క రెండవ రూపం అయిన మా బ్రహ్మచారిణి స్వీయ క్రమశిక్షణదాన్నే స్వయం లేక వ్యక్తిగత నియంత్రణ అనుకోవచ్చు.అంకితభా వానికి చిహ్నం. ఆమెను తరచుగా కోమల, కఠినన పద్ధతిలో చిత్రిస్తారు. స్వీయ నియంత్రణ అనేది తపస్సు యొక్క ప్రాముఖ్యతను ఎత్తిచూపిస్తుంది. బ్రహ్మచారిణి మాత నుండి, మన శక్తిని సరైన మార్గంలో కేంద్రీకరించడం మరియు స్వీయ-క్రమశిక్షణను అభ్యసించడం యొక్క విలువను మనం నేర్చుకుంటాము. ఆమె మన లక్ష్యాలకు అంకితభావంతో మరియు నిబద్ధతతో ఉం డటానికి, అంతర్గత బలం మరియు సంకల్ప శక్తిని పెంపొందించుకోవడానికి మనకు నేర్పిస్తుంది. . బ్రహ్మచారిణి మాత లక్షణాలను అనుకరించడం ద్వారా, మనం మన లక్ష్యాలను సాధించవచ్చు అపుడే ఆధ్యాత్మిక వృద్ధిని ప్రగతి సాధించవచ్చు.
పాఠం: స్వీయ-క్రమశిక్షణను నేర్చుకోవడం దానిపై దృష్టి కేంద్రీకరించండి మరియు లక్ష్యాలకు అంకితభావంతో చేయటం.

**మా చంద్రఘంటా :** దుర్గాదేవి యొక్క మూడవ రూపం అయిన మా చంద్రఘంటా ధైర్యం మరియు రక్షణకు చిహ్నం. ఆమె తరచుగా పులిపై స్వారీ చేస్తున్నట్లు చిత్రీకరించబడు తుంది, ఇది ఆమె ధైర్యం మరియు బలాన్ని సూచిస్తుంది. మా చంద్రఘంటా నుండి, "మనం నిర్భయంగా మరియు నమ్మకంగా ఉండటం మరియు మనల్ని మరియు ఇతరులను రక్షించుకోవడం యొక్క ప్రాముఖ్యతను నేర్చుకుంటాము". ఆమె మన అంతర్గత ధైర్యాన్ని ఉపయోగించుకుని భయాలు మరియు అడ్డంకులను అధిగమించడానికి మనకు బోధిస్తుంది. మా చంద్రఘంటా లక్షణాలను అనుకరించడం ద్వారా, మన జీవితాల్లో ధైర్యం మరియు రక్షణను పెంపొందించుకోవచ్చు.
పాఠం: వ్యక్తిగతంగా మరియు ఇతరులకు సహకరించి ధైర్యం, విశ్వాసం మరియు రక్షణను పెంపొందించుకోగల నేర్పు.

**మా కూష్మాండ :** దుర్గాదేవి యొక్క నాల్గవ రూపం అయిన మా కూష్మాండ సృజనాత్మకత మరియు శక్తి యొక్క స్వరూపం. ఆమె తరచుగా ఎనిమిది చేతులతో చిత్రీకరించ బడుతుంది, ఇది ఆమె సృజనాత్మక సామర్థ్యాన్ని మరియు శక్తిని సూచిస్తుంది. మా కూష్మాండ నుండి, "మన సృజనాత్మక సామర్థ్యాన్ని ఉపయోగించడం మరియు సానుకూలత మరియు ఆనందాన్ని వ్యాప్తి చేయడం యొక్క ప్రాముఖ్యతను మనం నేర్చుకుంటాము." ఆమె సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవడం మరియు శక్తివంతంగా మరియు ఉత్సాహంగా ఉండటం నేర్పుతుంది. మా కూష్మాండ లక్షణాలను అనుకరించడం ద్వారా, మనం మన సృజనాత్మక సామర్థ్యాన్ని ఉపయోగించుకోవచ్చు మరియు మన జీవితాల్లో సానుకూలత మరియు ఆనందాన్ని తీసుకురావచ్చు.
పాఠం: వ్యక్తిగత సృజనాత్మక సామర్థ్యాన్ని ఉపయోగించుకోవటం అన్నిటా సానుకూలంగా ఉండి అందరికీ ఆనందాన్ని వ్యాప్తి చేయటము.

**మా స్కందమాత :** దుర్గాదేవి యొక్క ఐదవ రూపం అయిన మా స్కందమాత మాతృ ప్రేమ మరియు పెంపకానికి చిహ్నం. ఆమె తరచుగా కార్తికేయుడిని పట్టుకుని, ఆమె తల్లి ప్రేమ మరియు సంరక్షణను సూచిస్తుంది. మా స్కంద మాత నుండి, "ఇతరులపై తల్లి ప్రేమ మరియు సంరక్షణను పెంపొందించుకోవడం మరియు రక్షణ మరియు మద్దతును అందించడం యొక్క ప్రాముఖ్యతను మనం నేర్చుకుంటాము" ఆమె మనకు పోషణ మరియు శ్రద్ధ వహించడం, మరియు మనకు మరియు ఇతరుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం నేర్పుతుంది. మా స్కందమాత లక్షణాలను అనుకరించడం ద్వారా, మన జీవితాల్లో మాతృ ప్రేమ మరియు శ్రద్ధను పెంపొందించుకోవచ్చు.
పాఠం: ఇతరుల పట్ల మాతృ ప్రేమ, పోషణ మరియు రక్షణను పెంపొందించుకోండి.

**మా కాత్యాయనీ :** దుర్గాదేవి యొక్క ఆరవ రూపం అయిన మా కాత్యాయనీ ధైర్యం మరియు బలానికి చిహ్నం. ఆమె తరచుగా సింహంపై స్వారీ చేస్తున్నట్లు చిత్రీకరించబడుతుంది, ఇది ఆమె ధైర్యం మరియు శక్తిని సూచిస్తుంది. మా కాత్యాయనీ నుండి, "సరైన దాని కోసం నిలబడటం మరియు న్యాయం కోసం పోరాడటం యొక్క ప్రాముఖ్యతను మనం నేర్చుకుంటాము."ఆమె మన అంతర్గత బలం మరియు ధైర్యాన్ని ఉపయోగించుకోవడం మరియు అడ్డంకులు మరియు సవాళ్లను అధిగమించడం నేర్పుతుంది.మా కాత్యాయనీ లక్షణాలను అనుకరించడం ద్వారా, మన జీవితాల్లో ధైర్యం మరియు బలాన్ని పెంపొందించుకోవచ్చు.
పాఠం: న్యాయం కోసం నిలబడండి, ధైర్యం మరియు బలాన్ని పెంపొందించుకోండి.

**మా కాళరాత్రి :** దుర్గాదేవి యొక్క ఏడవ రూపం అయిన మా కాళరాత్రి రక్షణ మరియు పరివర్తన మార్పు చిహ్నం. ఆమె తరచుగా ఉగ్ర రూపంలో చిత్రీకరించబడుతుంది, ఇది ఆమె శక్తి మరియు రక్షణను సూచిస్తుంది. కాళరాత్రి మాత నుండి, "మనల్ని మరియు ఇతరులను ప్రతికూల శక్తుల నుండి రక్షించుకోవడం మరియు మన జీవితాలను మంచిగా మార్చుకోవడం యొక్క ప్రాముఖ్యతను మనం నేర్చుకుంటాము" ఆమె మన అంతర్గత శక్తిని ఉపయోగించుకోవడం మరియు ప్రతికూలత మరియు అడ్డంకులను అధిగమించడం నేర్పుతుంది. కాళరాత్రి మాత లక్షణాలను అనుకరించడం ద్వారా, మనం మన జీవితాల్లో రక్షణ మరియు పరివర్తనను పెంపొందించుకోవచ్చు.
పాఠం: వ్యక్తిగత మరియు ఇతరులను రక్షించటం, జీవితాన్ని మార్చుకోండి మరియు ప్రతికూలతను అధిగమించండి

**మా మహాగౌరి :** దుర్గాదేవి యొక్క ఎనిమిదవ రూపం అయిన మా మహాగౌరి, స్వచ్ఛత మరియు ప్రశాంతతకు చిహ్నం. ఆమెను తరచుగా ప్రశాంతమైన మరియు ప్రశాంతమైన రూపంలో చిత్రీకరిస్తారు, ఆమె స్వచ్ఛత మరియు ప్రశాంతతను సూచిస్తుంది. మా మహాగౌరి నుండి, "అంతర్గత స్వచ్ఛత మరియు శాంతిని పెంపొందిం చుకోవడం మరియు ప్రతికూలత మరియు ఒత్తిడిని వదిలివేయడం యొక్క ప్రాముఖ్యతను మనం నేర్చుకుంటాము" ఆమె ప్రశాంతంగాఉండటమే కాక ప్రశాంతంగా ఉండటానికి మరియు మన శ్రేయ-స్సు మరియు ఆధ్యాత్మిక వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడానికి మనకు బోధిస్తుంది. మా మహాగౌరి లక్షణాలను అనుకరించడం ద్వారా, మన జీవితాల్లో స్వచ్ఛత మరియు ప్రశాంతతను పెంపొందించుకోవచ్చు.
పాఠం: అంతర్గత స్వచ్ఛత, శాంతి మరియు ప్రశాంతతను పెంపొందించుకోండి.

**మా సిద్ధిదాత్రి :** దుర్గాదేవి యొక్క తొమ్మిదవ రూపం అయిన మా సిద్ధిదాత్రి జ్ఞానం, జ్ఞానం మరియు ఆధ్యాత్మిక వృద్ధికి చిహ్నం. ఆమెను తరచుగా భక్తులకు వరాలను ప్రసాదించేదిగా చిత్రీకరించారు, ఆధ్యాత్మిక జ్ఞానం మరియు జ్ఞానోదయాన్ని ప్రసాదించే ఆమె శక్తిని సూచిస్తుంది. మా సిద్ధిదాత్రి నుండి, "జ్ఞానాన్ని కోరుకోవడం, జ్ఞానాన్ని పెంపొందించుకోవడం మరియు ఆధ్యాత్మిక వృద్ధిని పొందడం యొక్క ప్రాముఖ్యతను మనం నేర్చుకుంటాము". మన అంతర్గత సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలని మరియు ఆధ్యాత్మిక జ్ఞానోదయం కోసం కృషి చేయాలని ఆమె మనకు బోధిస్తుంది. సిద్ధిదాత్రి మాత లక్షణాలను అనుకరించడం ద్వారా, మనం మన జీవితాల్లో జ్ఞానం, జ్ఞానం మరియు ఆధ్యాత్మిక వృద్ధిని పెంపొందించుకోవచ్చు.
పాఠం: జ్ఞానాన్ని వెతకండి, జ్ఞానాన్ని పెంపొందించుకోండి మరియు ఆధ్యాత్మిక వృద్ధిని సాధించవచ్చు.
"నవదుర్గ లక్షణాలను పూజించడం మరియు అనుకరించడం ద్వారా, మన గురించి మరియు మన చుట్టూ ఉన్న ప్రపంచం గురించి లోతైన అవగాహనను పెంపొందించుకోవచ్చు మరియు ఆధ్యాత్మిక వృద్ధి మరియు జ్ఞానోదయాన్ని పొందవచ్చు. దేవత యొక్క ప్రతి రూపం మనకు విలువైన పాఠాలు మరియు లక్షణాలను బోధిస్తుంది, ఇవి జీవితంలోని సవాళ్లను అధిగమించడానికి మరియు మన లక్ష్యాలను సాధించడానికి సహాయపడతాయి.నవదుర్గ లక్షణాలను అర్థం చేసుకుని, వాటిని అనుకరించడం ద్వారా, మన జీవితాల్లో లోతైన ఉద్దేశ్యం మరియు అర్థాన్ని పెంపొందించుకోవచ్చు.
మన అంతర్గత బలాన్ని మరియు సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడం, ధైర్యం మరియు విశ్వాసాన్ని పెంపొందించుకోవడం మరియు మన శ్రేయస్సు మరియు ఆధ్యాత్మిక వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం నేర్చుకోవచ్చు. మనం నవదుర్గను పూజించి, గౌరవించేట ప్పుడు, సత్యం, న్యాయం మరియు కరుణ సూత్రాల ద్వారా మార్గనిర్దేశం చేయబడిన జీవితాన్ని గడపడం యొక్క ప్రాముఖ్యతను మనకు గుర్తుచేస్తాము. నవదుర్గ లక్షణాలను స్వీకరించడం ద్వారా, మనం మనల్ని మనం మరింత మెరుగ్గా మార్చుకోవచ్చు మరియు మన చుట్టూ ఉన్న ప్రపంచంపై సానుకూల ప్రభావాన్ని చూపవచ్చు. నవదుర్గ ఆశీర్వాదాలు స్వీయ-ఆవిష్కరణ మరియు ఆధ్యాత్మిక వృద్ధి వైపు మన ప్రయాణానికి మార్గనిర్దేశం చేస్తాయి".

**డా. ఈడ్పుగంటి పద్మజారాణి**

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఆదివారం అనుబంధం
28.9.2025




దాదాపు 3 ఏళ్లుగా పవన్ కళ్యాణ్ అభిమానులు 'ఓజి ఓజి' అంటూ తెగ జపిస్తూ వచ్చారు. ఆ సినిమా గ్లిమ్స్ ని యూట్యూబ్లో రిపీటెడ్ గా చూస్తూ వస్తున్నారు. మొత్తానికి వారి నిరీక్షణకి తెర దించుతూ ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చింది 'ఓజి' చిత్రం. మరి ఈ సినిమా ప్రేక్షకులను మరీ ముఖ్యంగా పవన్ అభిమానులను ఎంత వరకు ఆకట్టుకుందో ఈ రివ్యూ ద్వారా తెలుసుకుందాం రండి%ూ

**కథ :** ఓజి అలియాస్ ఓజాస్ గంభీర(పవన్ కళ్యాణ్) ఒక అనాథ. ఇతన్ని జపాన్ కి చెందిన ఓ సమురాయ్ చేరదీసి పెంచుతాడు. అయితే ఒక దాడిలో ఆ పెద్దాయనతో పాటు అతని జనం అంతా మరణిస్తారు. ఒక్క ఓజీ మాత్రం తప్పించుకుంటాడు. అక్కడి నుండి ఇండియాకి వచ్చేయాలని ఓ షిప్ ఎక్కుతాడు. అందులో ఇంకో పెద్దాయన సత్య దాదా(ప్రకాష్ రాజ్) అతనికి పరిచయం అవుతాడు. షిప్ లో జరిగిన దాడిలో తన బంగారాన్ని అతన్ని మనుషులను కాపాడినందుకు గాను ఓజిని చేరదీస్తాడు సత్య దాదా. అయితే కొన్ని కారణాల వల్ల సత్య దాదా కుటుంబానికి దూరమవుతాడు ఓజి.
అదే టైంలో మారణాయుధాలు(ఆర్.డి.ఎక్స్) కలిగిన ఓ కంటైనెర్ ను సత్య దాదా పోర్టులో దింపుతాడు జిమ్మి(సుదేవ్ నాయర్). ఇతను మహా క్రూరుడు అయినటువంటి ఓమి(ఇమ్రాన్ హాష్మీ) సోదరుడు. ఆ కంటైనెర్ అనేది ఓమికి,జిమ్మికి చాలా ముఖ్యం. కానీ ఆ కంటైనెర్ వాళ్లకి దక్కడానికి వీలు లేదు అని భావించి సత్య దాదా దాన్ని దాచేస్తాడు. దీంతో ఓమి, జిమ్మి .. సత్య దాదా కుటుంబాన్ని వేధిస్తారు.
ఈ క్రమంలో 'ఓజి' ముంబైకి తిరిగి వచ్చి సత్య దాదా అలాగే అతన్ని కుటుంబాన్ని కాపాడాడా? ఓమి కంటైనెర్ దక్కించుకోవడానికి ఎన్ని దారుణాలు చేశాడు. అసలు 'ఓజి' సత్య దాదా కుటుంబానికి దూరమయ్యేందుకు దారి తీసిన పరిస్థితులు ఏంటి? మధ్యలో కన్మణి(ప్రియాంక అరుల్ మోహన్) పాత్ర ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగిలిన సినిమా.

**విశ్లేషణ :** ట్రైలర్ చూస్తేనే 'ఓజి' కథ 90 శాతం అంచనా వేసే విధంగానే ఉంటుంది. సో స్క్రీన్ ప్లే ఇంట్రెస్టింగ్ గా ఉంటుందేమో అనే ఆశతో ప్రేక్షకుడు థియేటర్ కి వస్తాడు. అయితే సినిమా మొదలైన మొదటి 15 నిమిషాలకే 'ఇందులో కొత్తగా ఏమీ ఉండదు' అనే ఆలోచనకి ప్రేక్షకుడు వచ్చేస్తాడు. అయినప్పటికీ పవన్ కళ్యాణ్ ఇంట్రో సీన్, ప్రకాష్ రాజ్ తో పవన్ కళ్యాణ్ కాంబినేషన్ సీన్స్.. వీటికి తమన్ అందించిన ఆర్.ఆర్ ఆకట్టుకుంటాయి. కానీ హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్ ట్రాక్ ఎప్పుడైతే వచ్చిందో.. అప్పటి నుండి సినిమా ఫ్లాట్ అయిపోతుంది.
ఆ ట్రాక్ చాలా వరకు సీరియల్ ని తలపిస్తుంది అనడంలో సందేహం లేదు. అయితే ప్రీ ఇంటర్వెల్ బ్లాక్ ని దర్శకుడు బాగా డిజైన్ చేసుకున్నాడు. దీంతో అప్పటి వరకు ఉన్న లోపాలు ఇంటర్వెల్ ఫైట్ సీక్వెన్స్ మేనియాలో కొట్టుకుపోతాయి. ఇక సెకండాఫ్లో మళ్ళీ హీరో ముంబైకి ఇవ్వడం.. జరుగుతుంది. ఈ క్రమంలో వచ్చే పోలీస్ స్టేషన్ ఎపిసోడ్.. ఆ వెంటనే వచ్చే యాక్షన్ ఎపిసోడ్ అలరిస్తాయి. ఆ తర్వాత మళ్ళీ సినిమా ఫ్లాట్ అయిపోతుంది. తర్వాత ఏ దశలోనూ కోలుకోదు. దర్శకుడు సుజిత్ 'సాహో' లో చేసిన తప్పులే.. కాదు కాదు అంతకు మించిన తప్పులే ఇందులో కూడా చేశాడు. కాకపోతే పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కి కావాల్సిన ఎలివేషన్స్ ఇచ్చేసి మేనేజ్ చేసేద్దాం అనుకున్నాడు. అవి సింక్ అవ్వకపోవడంతో అతని ప్రయాస వ్యర్థమై పోయింది. ఇక్కడ ఇంకో కామెడీ ఏంటంటే ఇందులో 'సాహో' ని కూడా టచ్ చేశాడు సుజిత్. లోకేష్ కనగరాజ్ యూనివర్స్ లాగా ఇది సుజిత్ యూనివర్స్ అనుకోవాలేమో. తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగానే ఉంది. పాటలు ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు వెళ్ళిపోతాయో.. తెలీకుండానే వెళ్లిపోతాయి. ప్రొడక్షన్ వాల్యూస్ ఓకే.

**నటీనటుల విషయానికి వస్తే..** పవన్ కళ్యాణ్ నటుడిగా ఇందులో కొత్తగా చేసిందేమి లేదు.కానీ యాక్షన్ ఎపిసోడ్స్ లో , నడకలో తన శ్వాగ్ మిస్ అవ్వకుండా చూసుకున్నాడు. అభిమానులకు కావాల్సింది అదే. కాకపోతే ఊరికూరికే అరవడం అనేది కామన్ ఆడియన్స్ కి చిరాకు తెప్పిస్తుంది. ప్రియాంక అరుల్ మోహన్ ఎప్పటిలానే బ్లాంక్ ఎక్స్ప్రెషన్స్ తో లాగించేసింది. ప్రకాష్ రాజ్ నటన కూడా కొత్తగా ఏమీ ఉండదు. శ్రీయ రెడ్డి,హరీష్ ఉత్తమన్, అర్జున్ దాస్ బాగా చేశారు. ఇమ్రాన్ హాష్మీ విలనిజం పెద్దగా మెప్పించదు. అతని కటౌట్ కూడా పవన్ కళ్యాణ్ ముందు తేలిపోయింది. శుభలేఖ సుధాకర్ పాత్రని బిల్డప్ కోసం వాడుకుని సైడ్ చేసేశారు. ఏ దశలోనూ అతను పవర్ఫుల్ విలన్లా కనిపించడు. మిగతా నటీనటుల పాత్రలు అంతగా గుర్తుండవు.

**ప్లస్ పాయింట్స్ :** ఫస్ట్ హాఫ్, ప్రీ ఇంటర్వెల్ బ్లాక్, పోలీస్ స్టేషన్ ఎపిసోడ్, థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్

**మైనస్ పాయింట్స్ :** ఎమోషనల్ కనెక్టివిటీ లేకపోవడం, అనవసరమైన ఎలివేషన్లు, సెకండాఫ్, డైరెక్షన్

మొత్తానికి 'ఓజి' కోసం క్రేజీగా ఎదురుచూసిన ఆడియన్స్.. 'క్యాజి' సుజి(త్) అంటూ బయటకు వస్తారు. బాక్సాఫీస్ భారాన్ని పవన్ కళ్యాణ్ డై హార్డ్ ఫ్యాన్స్ వీకెండ్ వరకు మోసే అవకాశం ఉంది. ఆ తర్వాత డౌటే.

---




: విజయ్ ఆంటోని కరీర్లో 'బిచ్చగాడు' మూవీకి మించిన మూవీ మరేది రాలుదు. ఇప్పుడు ఈయనలో 25వ సినిమా భద్రకాళి వచ్చింది. ఈ సినిమా కోసం విజయ్ ఆంటోని తెలుగులో చాలా ఇంటర్వ్యూలు ఇచ్చినా.. సినిమాపై పెద్దగా బజ్ లేదు. కానీ, సినిమాపై ఎక్కడో ఒక పాజిటివిటీ. మరి ఆ పాజిటివిటీతో రిలీజ్ అయిన సినిమా ఎలా ఉందో ఇప్పుడు చూద్దాం.

**కథ :** రాష్ట్ర సచివాలయంలో టీ, కాఫీలు అందించే ఒక చిన్న ప్యూన్%ూ% అన్నీ లోసగులు తెలిసిన మిడియేటర్ (బ్రోకర్) అవుతాడు. అతనే కిట్టు (విజయ్ ఆంటోని). ఈ కిట్టు తన పని చేసుకుంటూనే రాష్ట్రపతిగా పోటి చేసే ఓ బడా బిజినెస్ మ్యాన్, ఎకనామిస్ట్ అబయాంకర్ కే వ్యతిరేకంగా వెళ్తాడు. ఇక్కడ హైదరాబాద్లో ఉండి దేశ రాజకీయాలనే కాకుండా%ూ% ప్రపంచ మార్కెట్ను శాసించే అబయాంకర్ను ఎలా ఎదుర్కొన్నాడు ? అంతటి సామర్థ్యం కిట్టుకు ఎలా వచ్చింది ? అసలు అబయాంకర్ చేసిన తప్పులేంటి ? అబయాంకర్కు కిట్టు కు ఉన్న సంబంధం ఏంటి ? అనేవి తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.

**విశ్లేషణ :** సమాజంలో జరిగే అక్రమాలు. దాని వెనక ఉండే రాజకీయ నాయ కలు. వారి వెనకాల ఉండే బడా వ్యాపార వేత్తలు. ఆ వ్యాపార వేత్తల స్వార్థం. ఈ లైన్పై చాలా సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా కోలీవుడ్ డైరెక్టర్ శంకర్ సినిమాలు కాస్త అటు ఇటుగా దాదాపు ఇదే లైన్తో ఉండేవి. ఇప్పుడు అదే లైన్ను ఓ బ్రోకర్ పాయింట్ ఆఫ్ వ్యూలో చూపించాడు డైరెక్టర్ అరుణ్ ప్రభు. సినిమా గురించి చెప్పే ముందు మిర్చి సినిమాలో ప్రభాస్ డైలాగ్ ఒకటి చెప్పాలి. సినిమాలో హీరోయిన్ పెళ్లి చూపుల టైంలో%ూ% పెళ్లి కొడుకు ఎత్తు, బరువు అన్నీ బాగున్నాయి. కానీ, పేరు బాలేదు అని అంటాడు. ఇక్కడ సినిమాలో విషయంలో కూడా అదే డైలాగ్ చెప్పొకోవచ్చు.

సినిమా బాగుంది. అంతా బాగుంది. కానీ పేరే బాలేదు.
పేరు ఎందుకు బాలేదు అంటే రన్ అయ్యే సినిమాకు టైటిల్కు జీరో కనెక్షన్. అసలు సంబంధం లేదు. చెప్పుకోవడానికి ఆ ఒక్క మైనస్ క్లియర్గా ఉంది.

**ఇక మిగితా సినిమా అంటే :** ఫస్టాఫ్ మంచి స్క్రీన్ ప్లే రాసుకున్నాడు. కథ కూడా బాగా రాసుకున్నాడు. హీరో ఇంట్రడక్షన్ ఆయన చేసే పని.. అవన్నీ కూడా ఒక సింగిల్ సాంగ్లో చూపించాడు. సినిమా స్టార్ట్ అవ్వడమే డైరెక్ట్ స్టోరీ. ఎక్కడా కూడా టైం వేస్ట్ చేయలేదు. కానీ, ఇంటర్వెల్ క్లైమాక్స్లా అనిపించడం ఒక మైనస్ అనుకోవచ్చు. దాని దాని తర్వాత స్టోరీ ఎటు వెళ్తుందో అర్థం కాలేదు. ఎక్కడ ఆపాలో కూడా డైరెక్టర్ కి అర్థం కాలేదు అనుకుంటా. సాధారణంగా మనం ఏదైనా ఇంట్రెస్టింగ్ కథ చెప్పే టైంలో దానిలో లీనమైతే దానికి ఎక్కడ ఫులిస్టాప్ పెట్టాలో అర్థం కాదు. అచ్చం అదే పరిస్థితి సెకండాఫ్. కానీ, మెసెజ్ అయితే ఇచ్చాడు.
థియేటర్లో కూర్చున్న ప్రతి ఆడియన్ హీరో చెప్పే మాటలు వింటాడు. అవును నిజమే అంటూ కనెక్ట్ అవుతాడు. ఒక సందర్భంలో హీరో%ూ% 3 కోట్ల మంది దించిన తల ఎత్తకుండా సోషల్ మీడియా చూస్తున్నారు అంటూ ఓ డైలాగ్ చెప్తాడు. అది నూటికి నూరు శాతం నిజం అని చెప్పొచ్చు. ఇలాంటి డైలాగ్స్ సినిమాలో చాలా ఉన్నాయి. వాటి అన్నింటికి ఆడియన్ కనెక్ట్ అవుతాడు. కానీ, దురదృష్టం ఏంటంటే%ూ% ఇలాంటి సినిమాలు మన దగ్గర ఎక్కువ ఆడవు.
ఇంత మంచి కథను సెకండాఫ్ను సరిగ్గా డీల్ చేస్తే విజయ్ సేతుపతి మహారాజా మూవీలా మంచి హిట్ కొట్టే ఛాన్స్ వచ్చేది.
విజయ్ ఆంటోనీ ఒంటి చేత్తో సినిమాను నిలబెట్టాడు. ఇతనికి 100 శాతం హెల్ప్ చేశాడు అబయాంకర్ పాత్ర చేసిన నటుడు. బడా నిర్మాతగా, రాష్ట్రపతి అభ్యర్థిగా, వీటితో పాటు విలన్గా.. కళ్లలో యాక్టింగ్ చేశాడు. స్పెషల్ ఆఫీసర్ రామ్ పాత్రలో చేసిన కిరణ్ తన పరిధి మేరకు చేశాడు. ఇక మిగితా పాత్రల గురించి పెద్దగా ఏం చెప్పలేం.
మ్యూజిక్ బాగుంది. కొన్ని సందర్భంల్లో సినిమాను మ్యూజిక్ కాపాడింది. సెకండాఫ్లో కాస్త ఎడిటింగ్ పడి ఉంటే బాగుండేది. నిర్మాణ విలువలు అంటే%ూ% సినిమా కోసం నిర్మాతలు పెద్దగా కష్టపడలేదు అనిపిస్తుంది. కానీ, మంచి మూవీ అయితే ఇచ్చారు.

ప్లస్ పాయింట్స్ : కథ, కథనం. విజయ్ ఆంటోనీ. ఫస్టాఫ్. మ్యూజిక్
మైనస్ పాయింట్స్ : సెకండాఫ్, టైటిల్తో సంబంధం లేకపోవడం. ల్యాగ్ సీన్స్
మొత్తంగా భద్రకాళి.. భద్రమే కానీ, టైటిలే సెట్ అవ్వలేదు

---

హృద్యమైన ట్రైలర్ తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన చిత్రం.. అర్జున్ చక్రవర్తి. విజయ రామరాజు ప్రధాన పాత్రలో విక్రాంత్ రుద్ర రూపొందించిన ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామా.. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి. కథ: అర్జున్ చక్రవర్తి (విజయ రామరాజు) ఒక అనాథ. చెత్త ఏరుకుని బతుకుతున్న అతణ్ని రంగయ్య (దయానంద్ రెడ్డి) అనే మాజీ కబడ్డీ క్రీడాకారుడు చేరదీస్తాడు. అతడి స్ఫూర్తితో తాను కూడా కబడ్డీ క్రీడాకారుడు కావాలని ఆ ఆటలోకి అడుగుపెట్టిన విజయ రామరాజు అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతాడు. దేశానికి అనేక గొప్ప విజయాలు అందిస్తాడు. కానీ అంతా బాగుంది అనుకున్న సమయంలో పరిస్థితులు ఎదురుతిరగడం.. నా అనుకున్న వాళ్లందరూ దూరం కావడంతో అర్జున్ జీవితం మీద ఆశ కోల్పోయి.. తాగుడుకు బానిస అవుతాడు. మరి అర్జున్ జీవితంలో మళ్లీ మార్పు ఏమైనా వచ్చిందా.. చివరికి తన కథ ఏ కంచికి చేరింది అన్నది మిగతా కథ. కథనం-విశ్లేషణ: కొన్ని సినిమాల ట్రైలర్లు చూడగానే ఈ కథ ఎలా మొదలవుతుంది.. అందులో ఎలాంటి మలుపులు వస్తాయి.. చివరికి ఎలా ముగుస్తుంది అన్నది క్లియర్ గా అర్థం అయిపోతుంది. అలా ముందే కథ పూర్తిగా అర్థమయ్యేలా ట్రైలర్లో చూపించేశాక.. ప్రేక్షకులను రెండు రెండున్నర గంటలు కుదురుగా కూర్చోబెట్టాలంటే కథనంలో మ్యాజిక్ ఉండాలి. తెలిసిన సన్నివేశాలనే ఎంతో ఆసక్తి రేకెత్తించేలా ప్రెజెంట్ చేయాలి. ప్రేక్షకులు ఊహించనిది.. కొత్తగా ఇంకేదో చూపించాలి. కానీ 'అర్జున్ చక్రవర్తి' అలా ఆశ్చర్యపరచలేక పోయింది. ట్రైలర్ చూసి మనం ఏం ఊహిస్తామో అదే ఉంటుంది సినిమాలో. కానీ ప్రతి సన్నివేశం సిన్సియర్ గా తీసినట్లు అనిపిస్తుంది. ఆర్టిస్టులు.. సాంకేతిక నిపుణులు ఎంతో మనసు పెట్టి పని చేశారని ప్రతి సన్నివేశం చాటుతూనే ఉంటుంది. ఐతే డ్రామా పండితే రొటీన్ అయినా బండి నడిచిపోతుంది. కానీ అక్కడే అర్జున్ చక్రవర్తి తడబడ్డాడు. డీవియేషన్లు లేకుండా.. కమర్షియల్ లెక్కలు వేసుకోకుండా.. సిన్సియర్ గా ఓ కథను చెప్పే ప్రయత్నం జరిగినా.. ఎమోషన్ వర్కవుట్ అయినా.. హీరో సహా ప్రధాన తారాగణం పెర్ఫామెన్సులు బాగున్నా.. స్లో నరేషన్ 'అర్జున్ చక్రవర్తి'కి బలహీనతగా మారింది. "చేతిలో ఆయుధంతో, శత్రు సైన్యంతో చేసేదే యుద్ధం కాదు. ఖాళీ చేతులతో కాలే కడుపుతో చేసేదే యుద్ధం".. "కన్నీళ్లకు రాలిపోయే జీవితం కాదు తనది".. 'నువ్వు మోస్తున్నది బరువును కాదు.. నీ గెలుపుని".. "మనిషికి పుట్టే ప్రేమ మనిషి కంటే గొప్పది కాదు".. "అవకాశం నిన్ను బలవంతుడిని చేస్తుంది. అవసరం నిన్ను బలహీనుడిని చేస్తుంది".. ఈ సంభాషణల్ని ఒకసారి పరిశీలిస్తే.. చాలా డెప్త్ కనిపిస్తుంది. ఇలాంటి లోతైన సంభాషణలు రాయాలంటే అందుకు తగ్గ సందర్భం కుదరాలి. సన్నివేశంలో అంత ఎమోషన్ ఉండాలి. కానీ 'అర్జున్ చక్రవర్తి'లో డైలాగుల్లో ఉన్నంత బలం సన్నివేశాల్లో కనిపించదు. ఆర్టిస్టుల పెర్ఫామెన్స్ బాగున్నా.. వారి నోటి నుంచి మంచి మంచి డైలాగులు వస్తున్నా.. ఇంకోవైపు నేపథ్య సంగీతంతో ఫీల్ పెంచే ప్రయత్నం జరుగుతున్నా.. సన్నివేశాలు మామూలుగా సాగిపోవడంతో ఓవరాల్ ఫీల్ తగ్గుతుంది. స్పోర్ట్స్ డ్రామాల్లో చాలావరకు కథలు ఒకేలా ఉంటాయి. ఉత్థాన పతనాలను చూపిస్తూనే కథల్ని నడిపిస్తారు. చివర్లో ఒక హైతో సినిమాకు ముగింపు ఇచ్చే ప్రయత్నం చేస్తారు. ఎమోషన్ వర్కవుట్ అయితే ఆ కథ పండినట్లే. అర్జున్ చక్రవర్తిలో ఒక మోస్తరుగా ఎమోషన్ పండినా.. అది కడుపు నిండే స్థాయిలో లేదు. స్పోర్ట్స్ డ్రామాల్లో ఆటకు సంబంధించిన సన్నివేశాలను రసవత్తరంగా చూపించడమే అత్యంత కీలకం. ఈ అవకాశాన్ని దర్శకుడు మరింత బాగా ఉపయోగించుకోవాల్సింది. కబడ్డీ సీన్లు ఒక మోస్తరుగా అనిపిస్తాయి తప్ప రోమాలు నిక్కబొడుచుకునేలా లేవు. అందులో డ్రామాను మరింత రక్తి కట్టించాల్సింది. అయితే ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధంలో అర్జున్ చక్రవర్తి మెరుగ్గా అనిపిస్తుంది. నటీనటుల పెర్ఫామెన్స్ వల్ల.. ఎమోషన్లు వర్కవుట్ కావడం వల్ల 'అర్జున్ చక్రవర్తి' చివరికి ఓకే అనిపిస్తుంది. పతాక సన్నివేశాలు



పర్వాలేదనిపిస్తాయి. హీరో పడ్డ కష్టం.. మేకర్స్ పెట్టిన సిన్సియర్ ఎఫర్ట్ వల్ల 'అర్జున్ చక్రవర్తి'ని మంచి ప్రయత్నంగా చెప్పొచ్చు కానీ.. కొంచెం నెమ్మదిగా సాగే ఈ సినిమా చూడ్డానికి కాస్త ఓపిక కావాలి. నటీనటులు: అర్జున్ చక్రవర్తి పాత్ర కోసం విజయరామరాజు ఎంతో కష్టపడ్డ విషయం తెరపై కనిపిస్తుంది. రకరకాల అవతారాల్లో కనిపించాల్సిన పాత్ర కావడంతో.. అందుకు తగ్గట్లుగా బరువు తగ్గడం.. పెరగడంతో పాటు అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడిగా కనిపించడం కోసం అతను ఎంత శ్రమించాడో అర్థమవుతుంది. విజయ రామరాజు నటన కూడా సిన్సియర్ గా సాగింది. కథానాయిక సిజా జోస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. తన లుక్ పాత్రకు సరిపోయినా.. ఆ క్యారెక్టర్ పరిధి బాగా తగ్గి పోయింది. తన పాత్రకు కథలో అనుకున్నంత ప్రాధాన్యం కని పించదు. చూపులతో కొంత నటించడానికి ప్రయత్నించినా సిజా పెద్దగా చేయడానికేమీ లేకపోయింది. దయానంద్ రెడ్డి కీలక పాత్రలో రాణించాడు. హీరో తర్వాత ఎక్కువ ఇంపాక్ట్ చూపిం చిం ది అతనే. కోచ్ పాత్రలో అజయ్.. హీరో ఫ్రెండు క్యారెక్టర్లో దుర్గేష్ ఆకట్టుకున్నారు. నెగెటివ్ క్యారెక్టర్లో అజయ్ ఘోష్ తనకు అలవాటైన రీతిలో నటించాడు. సాంకేతిక వర్గం: 'అర్జున్ చక్రవర్తి'లో సాంకేతిక విభాగాలు మంచి ఔట్ పుట్ ఇచ్చాయి. మూణ్నాలుగు దశాబ్దాల కిందటి వాతావరణాన్ని జగదీష్ చీకటి తన విజువల్స్ తో బాగా చూపించాడు. కబడ్డీ విజువల్స్ ను బాగా క్యాప్చర్ చేశాడు. విఘ్నేష్ భాస్కరన్ తన నేపథ్య సంగీతంతో సన్నివేశాలను ఎలివేట్ చేయడానికి గట్టిగా కృషి చేశాడు. కొన్ని కీలక సన్నివేశాల్లో ఆర్ఆర్ ఉద్వేగానికి గురి చేస్తుంది. కానీ కొన్ని చోట్ల డోస్ ఎక్కువైపోయినట్లు అనిపిస్తుంది. పాటలు పర్వాలేదు. చిన్న సినిమా అయినా.. నిర్మాణ విలువలు బాగున్నాయి. రైటర్ కమ్ డైరెక్టర్ విక్రాంత్ రుద్ర ఒక మంచి కథను సిన్సియర్ గానే చెప్పే ప్రయత్నం చేశాడు. తన డైలాగులు సినిమాకు పెద్ద ప్లస్. కానీ తన నరేషన్ మరీ స్లో. తెలిసిన సన్నివేశాలనే హృద్యంగా తీయడానికి ప్రయత్నించాడు కానీ.. చాలా చోట్ల నాటకీయత ఎక్కువైపోయింది.
చివరగా: అర్జున్ చక్రవర్తి..
సోసో స్పోర్ట్స్ డ్రామా



28. 9.2025 నుంచి 4.10.2025 వరకు

ఆదివారం అనుబంధం

సూర్య
www.suryaa.com
28.9.2025

# ద్వాదశరాశి ఫలములు (వార ఫలాలు)

(గమనిక: గోచార రీత్యా చెప్తున్న రాశి ఫలితాలు జనరల్ వి, వ్యక్తిగతంగా ఉద్దేశించి చెబుతున్నవి కావు, వ్యక్తిగత జన్మజాతకంలో అనగా వ్యక్తి జన్మ కుండలి (జన్మించిన సమయం, తేదీ, ప్రదేశం ఆధారంగా నిర్మించేది) ప్రకారం నడిచే దశలు అంతర్దశలు ప్రధానంగా చూసుకుంటూ ఆ దశ అంతర్దశలకు సంబంధించిన దానికి తగిన పరిహారాలు పాటించుకుంటూ, దానితో పాటు ఈ గోచార ఫలితాలను చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు).

## మేషరాశి

అశ్విని 1,2,3,4 పాదములు - భరణి 1,2,3,4 పాదములు
కృతిక 1వ పాదము

వారం ప్రారంభం చతుర్ధాధిపతి అయిన చంద్రుడు అష్టమ స్థానము, లగ్న అష్టమాధిపతి అయిన కుజుడు సప్తమ స్థాన సంచారం, తల్లి కుటుంబంలోని స్త్రీలతో విభేదాలకు దూరంగా ఉండాలి. గృహ వాహన సౌఖ్యాలు, స్థిరాసుల సంబంధ అంశాలు ఆశాజనకంగా ఉండవు. సాంఘిక సంబంధాలు, నూతన మైత్రి బంధాలు ఘర్షణాత్మకంగా ఉంటాయి. భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. వాహనాలు నడిపేటప్పుడు, ధనాన్ని ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్తగా ముందుకెళ్లాలి. వారం మధ్యలో తండ్రి గారికి ఆధ్యాత్మిక ప్రదేశాలు , ఉన్నత విద్య సంబంధ దూర ప్రయాణాలు మొదలైనవి అవకాశాలు. వారాంతంలో వృత్తి సంబంధ ఒత్తిడి. బాధ్యతలు అధికంగా ఉన్నప్పటికీ విదేశములలో ఉండే వ్యక్తులతో, వారి సహకారంతో నూతన వృత్తుల కొరకు చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన మంచిది.

## వృషభరాశి

కృతిక 2,3,4 పాదములు - రోహిణి 1,2,3,4 పాదములు
మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభం తృతీయాధిపతి అయిన చంద్రుడు సప్తమములో నీచస్థానము, సప్తమ వ్యయాధిపతి అయిన కుజుడు షష్ఠస్థాన సంచారము, సోదర, స్నేహ వర్గంతో అభిప్రాయ బేదములకు దూరంగా ఉండాలి. భాగస్వామితో కమ్యూనికేషన్ విషయంలో, వారి ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలి. స్వార్థపరులైన వ్యక్తులు స్నేహితులుగా ఉంటూనే మీ గౌరవాన్ని తగ్గించడానికి చేసే ప్రయత్నాల్లో మీరు అశాంతికి లోనవుతారు. ఆరోగ్య విషయంలో న్యాయ సంబంధమైన విషయాలు, పో టీల కొరకు ఖర్చులు అధికంగా ఖర్చులు అధికంగా ఉంటాయి. వ్యాపార విస్తరణ విషయం జాగ్రత్తలు అవసరం. వారం మధ్యలో అనవసర ఆందోళన, ముఖ్య విషయాలు, ప్రయాణాలు వాయిదా పడడం, సహకరించే వ్యక్తుల నిరాకరణ, ఆర్థిక విషయాలు ఆటంకాలు మనస్థాపాన్ని కలిగిస్తాయి. మీ విల్ పవర్ తో ఇబ్బందులని సమన్వయ పరుచుకుంటూ ముందుకెడతారు

## మిధునరాశి

మృగశిర 3,4 పాదములు - ఆరుద్ర 1,2,3,4 పాదములు
పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ద్వితీయాధిపతి అయిన చంద్రుడు షష్ట స్థానంలో, షష్ఠ లాభాధిపతి అయిన కుజుడు పంచమ స్థానంలో సంచారం. కుటుంబ సభ్యులతో గానీ, ఆర్థిక విషయాలలో వాగ్దానాలు చేసేటప్పుడు జాగ్రత్త అవసరం. ముఖ్యంగా ధనం సమయానికి సర్దుబాటు అయ్యే విషయంలో, సమయానికి తీసుకున్న వ్యక్తులు ఇవ్వకపోవడం వల్ల కూడా రుణములు చేసే అవకాశాలు. పరుష మైన మాటల వల్ల ఘర్షణలు, శత్రుత్వాలు పెరగకుండా జాగ్రత్తపడాలి. వీలైనంత తక్కువగా మాట్లాడాలి. కంటి ఆరోగ్య విషయంలో, కొత్త ప్రదేశాల్లో ఆహార స్వీకరణ సమయంలో జాగ్రత్త అవసరం. వారం మధ్యలో పూర్వపు శ్రమకు తగిన ఫలితం గుర్తింపు గౌరవం నూతన సంబంధాలు మైత్రి బంధాలు పెరుగుతాయి. జీవిత భాగస్వామితో అనుకూల వాతావరణం. వారాంతంలో వృత్తి, వ్యాపారంశాలలో ప్రయాణాలలో ఆకస్మిక వాయిదాలు,

## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము - పుష్యమి 1,2,3,4 పాదములు
ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో లగ్నాధిపతి చంద్రుడు పంచమ స్థానంలో నీచ, పంచమ రాజ్యాధిపతి అయిన కుజుడు చతుర్ధ స్థానంలో సంచారం గమనించగా, ఉద్వేగము తో కూడిన ఆలోచనలు అధికంగా ఉంటాయి అవి ముఖ్యంగా సంతానము వారి ఆరోగ్యము అభివృద్ధి, స్థిరాస్తుల పెట్టుబడులు. మానసిక ప్రశాంతత తన్ని పెంచుకునే విధంగా యోగ మెడిటేషన్ వంటి ప్రయత్నాలు అధికం చేయాలి. అనవసర ఆలోచనలని నియంత్రించుకోవడానికి ఇష్టదేవతారాధన మంచిది. వృత్తిపరమైన విషయాలలో కన్సంటేషన్ తగ్గుతుంది. వారం మధ్యలో పట్టుదలగా పూర్తి చేయడానికి సంకల్పిస్తారు. దైనందన జీవితంలో పడుతున్న కష్టానికి తగిన ప్రతిఫలం విషయంలో నిరాశ నిస్పృహలు మానసిక శక్తిని తగ్గిస్తాయి. ముఖ్యంగా మీ వ్యక్తిగత ఆరోగ్యం మీద శ్రద్ధ అవసరం. కుటుంబముతో కలిసి ఆధ్యాత్మిక ప్రయాణాలు,

## సింహరాశి

మఖ 1,2,3,4 పాదములు - పుబ్బ 1,2,3,4 పాదములు
ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో వ్యయాధిపతి అయిన చంద్రుడు చతుర్దములోనీచ, చతుర్ద,నవమాధిపతి అయిన కుజుడు తృతీయ స్థానంలో, తల్లి ఆరోగ్యము, గృహ వాహన విషయాల ఖర్చులు మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. భూమి వ్యవసాయ విషయాలు, స్థిరాస్తులు పెట్టుబడులు మిశ్రమ ఫలితాలు. విద్యార్థులు విద్యా సంబంధమైన విషయాలలో, నూతన అంశాలు నేర్చుకునేటప్పుడు డైవర్షన్ లేకుండా జాగ్రత్తగా ముందుకు వెళ్లాలి. వాహనాల నడిపేవారు శ్రద్ధ తీసుకోవాలి. వారం మధ్యలో అభివృద్ధి విషయంలో, వారి అవసరమైన వస్తువులు, వారికి ఎలక్ట్రానిక్ పరికరాలు కొనుగోలు చేస్తారు. పూర్వపు పెట్టుబడుల విషయం కొంత ఆశాజనకంగా ఉంటుంది. వ్యక్తిగత ఆరోగ్యం , రుణముల తీర్చే విషయం కొరకు ఖర్చులు. వారం చివరిలో నూతన వ్యక్తులతో మైత్రి, వ్యాపార విస్తరణ కొరకు, స్నేహ సంబంధాలు నిలుపుకొనుటకు ఆకస్మిక ఖర్చులు చేస్తారు

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు - హస్త 1,2,3,4 పాదములు
చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో లాభాధిపతి అయిన చంద్రుడు తృతీయములో నీచ, తృతీయ అష్టమాధిపతి కుజుడు ద్వితీయ స్థాన సంచారం గమనించగా కమ్యూనికేషన్ విషయంలో, నిర్ణయ సామర్థ్యం జాగ్రత్తగా ఉండాలి, తోబుట్టువులు, మిత్రులు ఆర్థికపరంగా లేదా మాట సహాయం వంటి సహకారం కోరుకుంటారు, కానీ అపార్థములు రాకుండా జాగ్రత్తగా ఉండాలి, దగ్గర ప్రయాణాలు చేసేటప్పుడు పరిచయం లేని నూతన వ్యక్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మీ శక్తిసామర్థ్యాలకు తగిన ఫలితము మిశ్రమంగా ఉంటుంది. వారం మధ్యలో గృహ వాతావరణం, తల్లి ఆరోగ్యం, విద్యాపరమైన విషయాలలో విద్యార్థులకు, అనుకూలంగా ఉంటాయి. వృత్తిపరమైన విషయాలలో శ్రమతో గౌరవాన్ని పొందుతారు. ఆలోచనలు ఫలిస్తాయి జ్ఞాపకశక్తిని పెంచుకుంటారు, సంతాన విషయంలో అభివృద్ధి.

## తులారాశి

చిత్త 3,4 పాదములు - స్వాతి 1,2,3,4 పాదములు
విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో రాజ్యాధిపతి చంద్రుడు ద్వితీయంలో నీచ, ద్వితీయ సప్తమాధిపతి కుజుడు జన్మరాశిలోనూ సంచారము, ముఖ్యంగా వృత్తి చేసే ప్రదేశాలలో వ్యక్తులతో మాట పట్టింపులకు విభేదాలకు దూరంగా ఉండాలి, గౌరవాన్ని పెంపొందించుకోవాలి. ఆర్థిక విషయాలు అసంతృప్తిగా ఉంటాయి. అధిక ఉద్వేగాలను నియంత్రించుకోవాలి. భాగస్వామితోనూ, వ్యాపార వ్యవహారాలలో వాదనలకు దూరంగా ఉండాలి. సోదర, బంధు వర్గంతో ఆర్థిక అంశాలు చర్చించేటప్పుడు వీలైనంత నిదానత అవసరం. వారం మధ్యలో వృత్తి చేసే ప్రదేశాలలో కొలీగ్స్ తో కమ్యూనికేషన్ లో, సహకారాన్ని ఆశించేటప్పుడు ఓపెన్ మైండ్ తో ముందుకు వెళ్లాలి. వృత్తిపరంగా సంబంధం లేని వ్యక్తుల జోక్యం చికాకు ని కలిగిస్తుంది. వారం చివరిలో గృహ వాతావరణం అనుకూలంగా ఉంటుంది, ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు.

## వృశ్చిక రాశి

విశాఖ 4వ పాదము - అనురాధ 1,2,3,4 పాదములు
జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో నవమాధిపతి అయిన చంద్రుడు రాశిలో నీచ, లగ్న షష్ఠాధిపతి కుజుడు ద్వాదశ స్థానంలో సంచారము గమనించగా, తండ్రి ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకుంటారు, ప్రతి విషయంలో అసంతృప్తిని జయించే విధంగా ప్రయత్నాలు చేయాలి, రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి, న్యాయ అంశాలు, ఇతరులకు ఇచ్చిన రావలసిన ధనం విషయం అసంతృప్తిని కలిగిస్తాయి. అవసరమైతే వైద్యులను సంప్రదించాలి. ఆత్మవిశ్వాసం, వృత్తిపరమైన నైపుణ్యాలు మిశ్రమఫలితాలు. వారం మధ్యలో కుటుంబ సభ్యులతో ఆకస్మిక ప్రయాణాలకి, వారి ఆరోగ్య శ్రద్ధకి ముఖ్యంగా సంతానం యొక్క అభివృద్ధికి ఆలోచనలు చేస్తారు. కుటుంబ వ్యక్తులతో ఆర్థిక, వాదనల వీలైనంత దూరంగా ఉండాలి. మీ క్రింది సిబ్బంది సహకరిస్తారు. సమయానికి తగిన విధంగా మాట్లాడడం స్ఫురించ కున్నట్లయితే మిత్రులతో, సోదర వర్గంతో అపార్థాలకి, అవకాశాలు

## ధనస్సు రాశి

మూలా 1,2,3,4 పాదములు -
పూర్వాషాడ 1,2,3,4 పాదములు - ఉత్తరాషాడ 1వ పాదము

ప్రారంభంలో అష్టమాధిపతి అయిన చంద్రుడు వ్యయ స్థానంలో నీచ, పంచమ వ్యయాధిపతి అయిన కుజుడు లాభ స్థానంలో సంచారం, ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ అవసరము, రావలసిన ధనం సమయానికి రావడంలో ఆటంకాలు,సంఘంలో ఉన్నత స్థాయి, గౌరవం కలిగిన వ్యక్తులని,ముఖ్యంగా అనవసరమైన విమర్శలకి, ఆందోళనలకి దూరంగా ఉండాలి. రీసెర్చ్ పేపర్స్ కొరకు కొత్త ఆలోచనలు. వ్యక్తిగత శ్రద్ధ, ఇష్టమైన వ్యక్తుల కొరకు ఖర్చులు అధికంగా ఉన్నప్పటికీ అవి మీకు ఇబ్బందిగా భావించరు. నూతన భూ సంబంధ పెట్టుబడుల కొరకు ప్రయత్నాలు, చర్చలు. రైటింగ్ స్కిల్స్ పెరుగుతాయి, కొత్త రచనలు, కవితాత్మక ధోరణి వలన సంఘంలో గౌరవం. వారం చివరిలో ఆర్థిక సంబంధంగా, కుటుంబ బంధాల్లో, వాగ్దానాలు నిలబెట్టుకునే ప్రయత్నం చేయాలి. ముఖ్యమైన పనులు ఆలస్యాలు ఆటంకాలు.

## మకరరాశి

ఉత్తరాషాడ 2,3,4 పాదములు - శ్రవణం 1,2,3,4 పాదములు
ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో సప్తమాధిపతి లాభములో నీచ, చతుర్ధ లాభాధిపతి దశమ స్థానంలో, వ్యాపార వ్యవహారాల్లోనూ ప్రయాణాల్లోనూ స్వార్థపూరితమైన వ్యక్తులకు దూరంగా ఉండాలి. భాగస్వామ్య వ్యవహారాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. జీవిత భాగస్వామికి రావలసిన లాభాలు మిశ్రమ ఫలితాలు ఇస్తాయి. గృహ వాహన విషయాలలో కొనుగోలు అంశాల లో కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. విద్యార్థులు విద్యాసంబంధమైన అంశాలలో మంచి విజయం సాధించడానికి అధిక శ్రద్ధతో, ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. వృత్తిపరంగా నూతన బాధ్యతలు అధిక శ్రమ, ఆర్థికపరమైన లాభం కొంత తక్కువ. వారం మధ్యలో విదేశీ ప్రయాణాల కొరకు ప్రయత్నాలు చేస్తారు. శత్రువుల మీద విజయం సాధిస్తూ నైపుణ్యాలు పెంచుకుంటారు. వారం చివర నిర్ణయ సామర్థ్యం బావుంటుంది దగ్గర ప్రయాణాలు అనుకూలిస్తాయి

## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు - శతభిషం 1,2,3,4 పాదములు
పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో షష్ఠాధిపతి అయిన చంద్రుడు దశమములో నీచ, తృతీయ దశమాధిపతి అయిన కుజుడు నవమ స్థానం, శ్రమకి తగిన ప్రతిఫలం తక్కువగా ఉందని భావిస్తారు, వృత్తి పరమైన నైపుణ్యాలు పెంచుకుంటూ, అధిక శ్రమతో ముందుకు వెళతారు. వృత్తిలో అనవసరమైన గాసిప్పులకు దూరంగా ఉండాలి. వృత్తి చేసే ప్రదేశాలలో కొలీగ్స్‌తో, పై అధికారులతో మాట పట్టింపులకు తావివ్వరాదు. వృత్తి పరమైన అసంతృప్తి భావోద్వేగాలని పెంచుతుంది. వాటిని నియంత్రించుకోవాలి. దూర ప్రదేశాలలో ఉండే తోబుట్టువుల లేదా మిత్రుల సహకారంతో వృత్తి మార్పు కొరకు ప్రయత్నాలు. వారం మధ్యలో వృత్తికి సంబంధించిన విషయాల్లో కొంత ఆశాజనకంగా అవకాశాలు కనబడతాయి. పోటీలలో ఇంటర్వ్యూలలో ప్రతిభ చూపిస్తారు. కొన్నిసార్లు బంధువుల సహకారం బాగుంటుంది. వారం చివరిలో కుటుంబము కొరకు ఖర్చులు అధికంగా పెడతారు.

## మీన రాశి

పూర్వాభాద్ర 4వ పాదము -
ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు - రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో పంచమాధిపతి చంద్రుడు నవమములో నీచ, ద్వితీయ నవమాధిపతి కుజుడు అష్టమ స్థానం, పెట్టుబడి విషయంలో జాగ్రత్తలు అవసరం, సంతాన ఆరోగ్యం ఆలోచనలు, మీ జ్ఞాపకశక్తి విషయం శ్రద్ధ అవసరం. కుటుంబ సంబంధమైన, ఆర్థిక విషయాలలో మిశ్రమ ఫలితాలు. సామాజిక సేవ చేస్తారు. తండ్రి నుంచి కొంతవరకు ఆర్థికంగా సహకారం లభించిన అసంతృప్తి అధికంగా ఉంటుంది. ఉన్నత విద్య కై దూర ప్రయాణాలు ఖర్చులతోనూ ,పెద్దల ఆరోగ్యం కొంత అశాంతిగా ఉంటాయి. రావలసిన ధనం సమయానికి అందడంలో ఆటంకాలు ఉండే అవకాశం ఉన్న రీత్యా ముందుగానే కొంత ధనాన్ని జాగ్రత్త చేసుకోవడం మేలు. వారం మధ్యలో వృత్తి పరంగా శ్రమ బాధ్యతలు అధికంగా ఉన్నప్పటికీ తగిన గుర్తింపు గౌరవాన్ని పొందుతారు. గృహ సౌఖ్యం బాగుంటుంది, విశాలమైన సౌకర్యాలు కలిగించుకుంటారు

నిర్వాహణ : స్వర్ణ కంకణ సన్మానిత, జ్యోతిష చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా. ఈడ్పుగంటి పద్మజారాణి
9849252852 - 7506976164 - padma.suryapaper@gmail.com



